ప్రజాశక్తి సోపతి

జనవరి 11, 2015 ఆదివారం అనుబంధం

మహా ఆకర్షణ నుమాయిష్

హస్తకళల కేంద్రం

రవీంద్ర కళాశ్రమం

- ప్రపంచ కప్ జట్టులో అంబటి
- హిందీ కథ 'విషం'
- జ్ఞాపకంగా మిగిలిన సంగీతస్వరం
- స్ఫూర్తి, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ కవితలు

ఒక తరానికి ఆకర్షణ



కొందరిని తలుచుకుంటే వెల్లువెత్తే జ్ఞాపకాలు అందంగా ఉంటాయి. అబ్బురపరుస్తాయి. ఆ కోవకు చెందిన మనిషి శోభన్‌బాబు (14 జనవరి 1937–28 మార్చి 2008). దాదాపు మూడు దశాబ్దాలపాటు వెండితెర వెలుగుగా నిలిచిన కథానాయకుడు. ఆ తరంలో అందాల నటుడిగా గుర్తింపు పొందారు. అతని హెయిర్ స్టైల్, టక్ చేసే పద్ధతి, చూపు, మాటల్లోని విరుపు, సొగసైన నవ్వు అటు అబ్బాయిల్నీ, ఇటు అమ్మాయిల్నీ ఆకర్షించేవి. అంతగా ప్రేక్షకుల మనసు దోచిన నటుడు శోభన్‌బాబు. దాదాపు 230 చిత్రాల్లో నటించిన ఆయన్ని ప్రత్యేకించి మధ్యతరగతి కుటుంబీకులు, మహిళలు, యవ్వన ప్రాయంలో ఉరకలెత్తే ఆయా కాలాల యువకులు అభిమానించారు, ఆరాధించారు. ఆయన నటించిన పాత్రలతో తాదాత్మ్యం చెందారు.

ముఖ్యంగా 1965–96 మధ్య కాలంలో ఆయన నటించిన సినిమాల్లో ఎక్కువశాతం విజయవంతమయ్యాయి. చూసిన సినిమానే మరలమరల చూశారు. తొలి యవ్వనప్రాయంలో కవిత్వం రాసే కవులకు 'మల్లెపువ్వు'లోని శోభన్‌బాబు పాత్ర బాగా గుర్తుండిపోయింది. అలాగే 'గోరింటాకు' చిత్రంలో అమాయకమైన ప్రేమికుని పాత్రలోనూ తమని తాము చూసుకున్న వారు ఎందరో! 'మానవుడు – దానవుడు'లో పోషించిన పాత్రలోని ఆదర్శం ఒక స్ఫూర్తి.

ఒకతరం మహిళలకు శోభన్‌బాబు బాగా బాగా నచ్చాడు. ఎందుకంటే కుటుంబానికి అంకితమయ్యే స్వభావం అతను ధరించిన పాత్రల్లో ఇమిడివుంది. ప్రేమకు నిబద్ధమయి, మాటమీద నిలబడే స్వభావం వ్యక్తమైంది. ప్రేమికురాలి కోసమో, లేదంటే జీవన భాగస్వామి కోసమో తన స్వార్థం, తన సుఖం అన్నది చూసుకోకుండా సర్వం త్యాగం చేసే లక్షణం అతను పోషించిన పాత్రల ప్రత్యేకత. మల్లెపూవు, గోరింటాకు, మహారాజు వంటి పాత్రలే ఇందుకు ఉదాహరణ. అంతేకాదు, తల్లి కోసం, చెల్లెలి కోసం, అన్యాయమైపోయే మహిళల కోసం నిలబడిన పాత్రల్లో శోభన్‌బాబు నటించడం కాదు జీవించారు.

ఆయా పాత్రల్లోని నిస్వార్థత్యాగం, బేలతనం, అమాయకత్వం చూసి కన్నీళ్ళు పెట్టారు. 'మహారాజు' చిత్రంలో చెల్లెళ్ళను, తమ్ముళ్ళను పెంచి పెద్ద చేయడానికి ఎంతో శ్రమిస్తాడు. చివరకు వారు అతన్ని కాదని వెళ్ళిపోతే ఖేదానికి లోనవుతాడు. దు:ఖితుడవుతాడు. అప్పుడు భార్యగా నటించిన సుహాసిని నీకోసం నేనున్నానని ఓదారిస్తేగాని సాంత్వన చెందలేని బేలతనం అతనిది. అదే ఆ సినిమా విజయానికి మూలం. అయితే ఈ బేలతనంతోపాటు దుడుకుతనం, కొంటెతనం, పొగరుదనం, గాంభీర్యం ఒలకించడంలో తనకు తానే సాటి అనిపించుకున్నారు.



తొలిరోజుల్లో చిన్నచిన్న పాత్రలు పోషించినా, వీరాభిమన్యు చిత్రం తర్వాత అతని ప్రయాణం అప్రతిహతంగా కొనసాగింది. తనంతట తాను 1996లో 'హలో గురు' సినిమా తర్వాత చిత్రరంగం నుంచి తప్పుకున్నారు. విజయాల్ని సాధించడమే కాదు, తగిన సమయం చూసి రంగం నుంచి తప్పుకోవడం కూడా తెలిసిన శోభన్‌బాబు. ఆకెళ్ళ రాఘవేంద్ర రాసిన శోభన్‌బాబు జీవితచరిత్ర చదివితే మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి.

శోభన్‌బాబు మరో ప్రత్యేకత ఏమంటే ఒకే తరహా పేరు గల చిత్రాల్లో ఎక్కువగా నటించడం. జీవనజ్యోతి, జీవన తరంగాలు, జీవనరాగం, జీవన పోరాటం, జీవితం, జీవిత ఖైదీ, జీవితనౌక, జీవిత బంధం, జీవితరథం మొదలైన చిత్రాల్లో నటించారు. అలాగే బాబు, బంగారు బాబు, డాక్టర్ బాబు, డ్రైవర్ బాబు, మైనర్‌బాబు, దొరబాబు వంటి చిత్రాలున్నాయి. బంగారు చెల్లెలు, బంగారు పంజరం, బంగారు తల్లి, కన్నతల్లి, తల్లీకూతుళ్ళు, సోగ్గాడు, ఊరికి సోగ్గాడు, సోగ్గాడి కాపురం, సక్కనోడు ఇలా ఒకేవిధమైన పేర్లతో కూడిన సినిమాల్లో శోభన్‌బాబుని చూస్తాం. ప్రేక్షక హృదయాల్ని ఆకర్షించిన ఒక పేరును అనుసరించి ఇలాంటి పేర్లు పెట్టివుంటారు. ఇది శోభన్‌బాబు అంటే నాటి ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తార్కాణం. అప్పుడే కాదు ఇప్పుడు కూడా శోభన్‌బాబు నటునిగా చూపిన ప్రతిభను గురించి మాట్లాడుకుంటాం. కనుకనే తను వెళ్ళిపోయినా తన రూపు చెదరని స్మృతిగా నిలిచివుంది.

– సంజీవి

■ అంతరంగం

భిన్నత్వాన్ని గౌరవించడం

వైవిధ్యం మానవ జీవన సారం. మనుషులంతా మూసపోసినట్టుగా ఉండరు. ఉన్నట్టు కనిపిస్తారే గానీ ఎవరి ప్రపంచం వారిదే. ఎవరి ఊహాలోకం వారిదే. వైరుధ్యాలు అనేకం. వైవిధ్యం అనంతం. ఆ వైరుధ్యాలు మిత్రపూరితంగా వున్నంతవరకు పేచీలేదు. శత్రుపూరితంగా మారినప్పుడే మానవసంబంధాలు ప్రశ్నార్థకమవుతాయి. మనిషి స్వభావం, నడవడిక విమర్శలకు లోనవుతాయి. భిన్నత్వాన్ని గౌరవించలేకపోవడం వల్లనే సమస్యలు ఎదురవుతాయి. ఒకరి ఆచార వ్యవహారాలు మరొకరికి భిన్నంగా ఉండడంలో అభ్యంతరం ఉండక్కర్లేదు. ఎవరి శైలి వారిదే అన్న భావాలకు బలం చేకూరాలి. కానీ తాము చెప్పిందే శిరోధార్యం, తాము చెప్పిందే వేదమనే వాదం మూర్ఖత్వం. ఆ మూర్ఖత్వం వ్యవస్థీకృతమై మనుషుల్ని శాసించబోతే ఘర్షణ తప్పదు. ఇప్పుడు మన సమాజంలో నెలకొన్న సంఘర్షణ అలాంటిదే.

'భిన్నత్వంలో ఏకత్వం' అన్న భావనలోని వైశిష్ట్యం ఏమిటో ఇప్పుడు తెలుస్తుంది. ఇది కేవలం ఒక సూక్తి కాదు. ఆచరణలో నిగ్గుదేలిన సూత్రం. సకల మానవాళి అనుసరించదగ్గ మార్గం. ఆ భిన్నత్వాన్ని గౌరవించే సహనం అలవరుచుకోవాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్ని ఉపయోగించుకుంటూ అసహనాన్ని పెంచి పోషించే భావాల్ని వ్యాప్తి చేయడం దుర్మార్గం.

ఎవరు ఎవరితో జత కట్టాలో, ఎవరు ఎలాంటి బట్టలు ధరించాలో, ఎవరు ఎవరిని పూజించాలో, ఎవరు ఎంత మంది పిల్లల్ని కనాలో చెప్పబోవడం మధ్యయుగాల కాలాన్ని తలపిస్తోంది. రాచరికపు పోకడల్ని గుర్తు చేస్తుంది. ఇలాంటి వారు విధాన నిర్ణేతల స్థానంలో ఉండడం విషాదం. మనుషుల జీవనశైలిలో భిన్నత్వం సహజం. ఈ సహజత్వాన్ని ప్రశ్నించబోవడం అశాస్త్రీయం. దీనిని సహించడం మరీ ముఖ్యంగా ఈ కాలంలో చెల్లదుగాక చెల్లదు. కనుకనే అనేకరూపాల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సాహిత్య కళా రంగాలు ఈ పనిని మరోరూపంలో చేస్తున్నాయి. దేవుని పేరిట, మతం పేరిట మనుషులతో ఆడుకునే తీరును గర్హిస్తున్నాయి. వ్యంగ్యాన్ని ఆశ్రయించినప్పటికీ ఆ వ్యంగ్యంలో పదునైన విమర్శ దాగుంది. దానిని కూడా సహించే స్థితిలో లేనందున అసహనం అవాంఛనీయ రూపాల్లో వ్యక్తమవుతోంది.

అంతమాత్రాన సహనం, సామరస్యం ఓడిపోవు. మూఢత్వం, ఛాందసవాదం పైచేయి సాధించలేవు. ఈ ఎరుక ఉన్నందునే శాస్త్రీయ దృక్పథంతో, సహనంతో మనుషులు ప్రయాణిస్తున్నారు. భిన్నత్వాన్ని గౌరవించని ప్రతీపశక్తుల్ని నిలదీస్తున్నారు. వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడే ధోరణుల్ని ప్రతిఘటిస్తున్నారు. విభిన్నతను గౌరవించే భావాలకు బలిమి చేకూరుతుంది. ఈ క్రమాన ఈ చైతన్యం మరింత విస్తృతమవడం సమాజశ్రేయస్సుకు అవసరం.

వెంటాడే వాక్యం

స్వల్ప విషయాలనించీ ఎంత అద్భుతమైన ఫలితాలొస్తాయో గ్రహించినప్పుడు నాకనిపిస్తుంది, అసలు స్వల్పమైనవంటూ ఏమీ లేవని. - బ్రూస్ బార్టన్

ప్రజాశక్తి సోపతి

జనవరి 11, 2015

లేఖలు	**4**
కవర్‌స్టోరీ	
హస్తకళల కేంద్రం రవీంద్ర కళాశ్రమం	**5**
శ్రమించాడు సాధించాడు	**10**
జోక్స్ కార్నర్	**11**
ప్రత్యేకం మహా ఆకర్షణ నుమాయిష్	**12**
నెమలీక	**14**
సీరియల్ ప్రేమ - విప్లవం	**16**
నివాళి తీగ తెగిన వీణ	**18**
అనువాద కథ విషం	**20**
సోర్స్‌కోడ్ సృష్టికి ప్రతి సృష్టి త్రీడీ ప్రింటింగ్	**23**
సమీక్షలు	
నిర్దిష్ట అవగాహనకు అధ్యయనం	**24**
ఈ వారం కవిత్వం	
చిగురించిన జీవిత వంతెన	**26**



అదిలాబాద్‌లో ఓ సందర్శనీయస్థలి రవీంద్ర కళాశ్రమం. పల్లెని కేంద్రంగా చేసుకున్న సాంస్కృతిక జీవితాన్ని ప్రతిఫలిస్తున్న ఈ కళాశ్రమంపై ముఖచిత్రకథనమిది.

లేఖలు

వెబ్ వెలుగుల తెలుగు బాగుంది

గత ఆదివారం సోపతిలో ఇచ్చిన వెబ్ వెలుగుల తెలుగు కవర్‌స్టోరీ బాగుంది. ఇంటర్నెట్ వినియోగం, వెబ్ సమాచారం అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రపంచమే ఒక కుగ్రామంలా మారింది. ఏ సమాచారమైనా క్షణాల్లో కళ్లముందు ప్రత్యక్షమయ్యే సౌలభ్యం ఏర్పడింది. ప్రపంచంలోని అనేక భాషల్లో వెబ్‌సైట్లు విస్తరిస్తుండటం ఒక మంచి పరిణామం. ఇదేగాక అనేక విషయాలకు, విజ్ఞానానికి నెలవుగా ఉంటున్న వెబ్‌సైట్‌ల విషయాల గురించి ఈ కథనంలో చాలా చక్కగా చెప్పారు. ముఖ్యంగా మన మాతృభాష తెలుగును మాట్లాడడమే నామోషీగా అనుకుంటున్నారు కొందరు. అలాంటి పరిస్థితుల్లో కూడా వెబ్ సైట్లలో విస్తృతంగా తెలుగు విస్తరించడం సంతోషించాల్సిన విషయం.

– కావ్య, అడ్డగుట్ట, సికింద్రాబాద్

బాలచందర్ గురించి బాగా ఇచ్చారు

స్త్రీ నుంచి స్త్రీకి చేసిన ప్రయాణం శీర్షికన ఆదివారం సోపతిలో ప్రముఖ దర్శకుడు బాలచందర్ గురించి అనేక విషయాలు చాలా చక్కగా చెప్పారు. ఆ కథనం చదువుతుంటే ఆయన సినిమాలన్నీ కళ్లముందు కదలినట్లు అనిపించింది. ముఖ్యంగా ఆయన జీవితం, దర్శకత్వంలోకి అడుగిడిన వివరాలు, సినిమాల్లో స్త్రీలకు ఇచ్చిన ప్రాధాన్యత తదితర విషయాలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి.

– వంశీ, సఫీల్‌గూడ, హైదరాబాద్

కొత్తగా అనిపించింది

ఆదివారం సోపతిలో 'ఆశలు మోసులెత్తే కాలం' శీర్షిక సందర్భోచితంగా ఉంది. కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ ఈ కథనం చదవడం ఉత్సాహం కలిగించింది. ఏడాదిపాటు ఎన్నో అనుభవాలు, అనుభూతులు, ఆనందాలు ఏవైతేనేం... వాటన్నింటికీ వీడ్కోలు చెప్పి, మరో సంవత్సరాన్ని స్వాగతించే దిశలో ఈ కథనం అలరించింది.

– వీణ, అచ్చంపేట, మహబూబ్‌నగర్ జిల్లా

ఊహించని కథనం

'బద్నామ్' కథ ఆసక్తిగా సాగింది. కథ ఆసాంతం చదివే వరకు అందులోని పాత్రలను ఊహించలేని విధంగా రాశారు రచయిత. బొమ్మలు లేకుండా ఉన్నట్లయితే నిజంగానే ఇందులో పాత్రలు జంపుతులేనని నమ్మడం కష్టం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్య దోమలు. వీటి వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి ఎన్నో వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటి బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వున్న నాయకులు ఫొటో ఫోజులకే పరిమితమవుతున్నారని మంచి సెటైర్ కథ ఇచ్చారు.

– రాజేష్, మెదక్

కాలం విలువ

అంతరంగంలో 'కాలం' విలువని విశ్లేషించిన తీరు ఆకట్టుకుంది. సంవత్సరాలు దొర్లిపోతున్నా పట్టించుకోని వాళ్లు కూడా నూతన సంవత్సరం మొదలైన రోజున నానా హంగామా చేసే వారికి ఈ వ్యాసం చక్కగా ఉపయోగపడుతుంది.

– నరసింహరాజు, ఆర్మూర్, నిజామాబాద్

మన జాతీయాలు

కూపస్థ మండూకం

కూపస్థ మండూకం అంటే నూతిలోని కప్ప అని అర్థం. కొందరు 'కూపస్థ కూర్మం' అని కూడా వ్యవహరిస్తారు. కూపం అంటే నుయ్యి లేదా బావి. బావిలో పుట్టిన కప్ప దరి చుట్టు తిరిగి అదే ప్రపంచం అనుకుంటుంది. దానికి బాహ్య ప్రపంచం తెలియదు. కూర్మమనగా తాబేలు. తాబేలు కూడా అలాగే భావించి జీవిస్తుంది. ఇదే మాదిరి కొంతమంది మిడిమిడి జ్ఞానంతో అంతా తెలిసినట్టుగా వ్యవహరిస్తారు. అటువంటి వారిని కూపస్థ మండూకం అనడంలో వ్యవహారంలో ఉంది. తమకంతా తెలుసంటారు కొందరు. వారికేమీ తెలియదు.

అద్దంలో ముడుపు

వెనుకటికో లంచగొండి అమ్మాయ్యా చెల్లిస్తే గాని పని చేయనన్నాడట. పని చేసి పెట్టమన్న వాడు కూడా సామాన్యుడేమీ కాదు. పని అయిన తరువాత ఇస్తానన్నాడట. ఆ అధికారికి అనుమానం కలిగింది. అసలు వీడి దగ్గర డబ్బున్నదో లేదోనన్న సందేహం కలిగింది. అయితే వారిద్దరు బేరసారాలు చేసుకొని ఓ ఒప్పందానికొచ్చారు. ముడుపు చూపిస్తే నేను నమ్మి నీ పని చేసి పెడతానని అన్నాడు అధికారి. ముడుపు అద్దంలో చూపుతానన్నాడీ ఆసామి. "సరే" అన్నాడు అధికారి. అద్దంలో ముడుపు చూశాట్ట. ముడుపంటే మూట. ఆ మూటలో ఏముందో విప్పితేగానీ తెలియదు. కాని దానిలో ఏముందో తెలియదు. చివరకు దాని నీడనే గ్రహించి సరిపెట్టుకోమనవచ్చు. ఈ విషయం ఆ అధికారి అయిన లంచగొండి ఊహించలేకపోయాడు. మొత్తం మీద ముడుపు నిజమో, నీడనో నిర్ణయించలేని స్థితి. అది యిచ్చేదో ఎగవేసేదో అంతకన్నా తెలియని విషయం.

అందుబాట్లో ఉన్నట్లు కనిపిస్తూ – అందనిది అందుకోవడం కుదరని ఏ విషయమైన అద్దంలోని ముడుపే. అది ఉన్నట్లు కాదు లేనట్లు కాదు. ఇలా అనిశ్చితంగా, బ్రహ్మపదార్థంలా, అనిర్వచనీయంగా ఉన్న ఏ విషయాన్నైనా అద్దంలో ముడుపు అని వ్యవహరించటం పరిపాటి.

బెల్లం కొట్టిన రాయి

రాయిని దేనితో కొట్టినా చప్పుడవుతుంది. కాని అదే రాయితో బెల్లం ముద్దని కొడితే చప్పుడు అంతగా రాదు. బెల్లం దానికి అంటుకొని పోతుంది. కాబట్టి చప్పుడు అంతగా రాదు. సర్వసాధారణంగా రాయితో రాయిని మోదినా రాయితో ఇనుమును కొట్టినా నిప్పురవ్వలు కనిపిస్తాయి. కానీ, బెల్లంకొట్టిన రాయితో మోదితే రవ్వలు రావు. సవ్వడి రాదు. తెలివితక్కువ వాళ్ళను, సోమరులను ఈ పదాలతో పోలుస్తారు. ఇటువంటివాళ్ళు కూడా ఎప్పుడో ఒకప్పుడు చలిస్తారు. ఈ రాయిలాంటి వాళ్ళయితే ఏ మాటకు కదలరు, మారు మాట్లాడరు. అందుచేత ఏమన్నా ఏమి చేసినా పట్టించుకోని, ఎదురు తిరుగని వాళ్ళను బెల్లం కొట్టిన రాయిలా ఉన్నారంటారు.

– యం.వి.నరసింహారెడ్డి



హస్తకళల కేంద్రం

రవీంద్ర కళాశ్రమం

‘ఒక పెద్ద మనిషి తను నడుపుతున్న హాస్టల్‌లో పిల్లలను క్రమశిక్షణలో పెట్టడం ఎలా అని ఆలోచించాడు. అదే ఊర్లో ఉంటున్న ఒక గురూజీ వద్దకు వెళ్ళి సలహా అడిగాడు. పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచడం ఎలా అని? అప్పుడు వెంటనే గురూజీ మీ హాస్టల్‌లో మంచినీటికి ప్లాస్టిక్ కుండ వాడతారా లేక మట్టి కుండ వాడతారా అని ప్రశ్నించారు. ప్లాస్టిక్ కుండలే వాడతామని చెప్పాడు. గురూజీ వెంటనే ప్లాస్టిక్ కుండలను తీసేసి, మట్టి కుండలను వాడమన్నారు. అదేంటి ప్లాస్టిక్ కుండలకు, క్రమశిక్షణకు సంబంధం ఏంటని అడిగాడు ఆ పెద్ద మనిషి. ఎందుకంటే ప్లాస్టిక్ చాలా సులభంగా ఉపయోగించవచ్చు. దాన్ని లేపడం, కడగడం, నీళ్ళు నింపడం, కింద పెట్టడం వంటి పనులు ఎలాగైనా చేయొచ్చు. కాని మట్టి కుండ శుభ్రం చేసే విధానం వేరు. దాన్ని ఉపయోగించాలంటే చాలా జాగ్రత్తగా ఉండాలి. కాబట్టి మట్టి కుండ వాడితే పిల్లలకు బాధ్యత, క్రమశిక్షణ దానంతట అవే వస్తాయని సమాధానం చెప్పాడు. గురూజీ మాటల్లో ఆంతర్యం అర్థం చేసుకున్న ఆయన వెంటనే హాస్టల్‌కు వెళ్ళి ఆయన చెప్పిన మట్టికుండ సలహాని పాటించడం మొదలుపెట్టాడు’.

పైన చెప్పిన విషయాలన్నీ చందమామ కథల పుస్తకంలోని చిన్న పిల్లల కథ కాదు. నిజంగానే ఒక గురూజీ ఒక హాస్టల్ వార్డెన్‌కి ఇచ్చిన సలహా. గ్రామాలలో తయారు చేయబడిన ఏ వస్తువైనా మనిషిని సక్రమమైన దారిలో, బాధ్యతా యుతమైన జీవితం గడిపేలా చేస్తుందని ఆయన గట్టి నమ్మకం. ఆ గురూజీ మరెవరో కాదు. ఆదిలాబాద్ జిల్లాలో కళాశ్రమాన్ని నడుపుతున్న రవీంద్ర శర్మ. గ్రామాలను, చేతివృత్తులను కాపాడుకోవాలనే కోరుకునే వారికి ఆయన గురించి తెలుసు. నాశనమైపోతున్న చారిత్రాత్మకమైన వస్తుసముదాయాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలనుకునే ప్రతి మనిషికీ రవీంద్రశర్మ సుపరిచితులే. ఆయన చేస్తున్న ఆ కృషి గురించి తెలుసుకొని ఆదిలాబాద్ వెళ్ళి ‘సోపతి’ ఆయన్ని పలకరించింది. గ్రామీణ ప్రాంత హస్తకళలు, గ్రామ సీమల జీవన విధానం గురించి ఆయన చెప్పిన ఎన్నో విషయాలను పాఠకులతో పంచుకుంటోంది.

పల్లెలపై ఆయనకు ఎనలేని ప్రేమ. అంతరించిపోతున్న పురాతన సంపదను ఒకచోటకు చేర్చి వాటిని కాపాడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలనూ సందర్శించారు. వారి భాష, వేషం, ఆహారం, సాంప్రదాయం గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. నిరుపయోగంగా పడేయబడ్డ ఎన్నో పురాతన నిత్యావసర వస్తువులను సేకరించి ఆశ్రమంలో జాగ్రత్త చేశారు. ఇదంతా ఎవరో చెబితే చేసినది కాదు. తనంతట తానుగా శిథిలమై పోతున్న గ్రామీణ వ్యవస్థను గురించి భావితరాలకు తెలపాలని చేసిన ప్రయత్నమే.

రవీంద్రశర్మగారి పూర్వీకులది పంజాబ్ దగ్గరలోని లాహోర్. ప్రస్తుతం ఆ ప్రాంతం పాకిస్తాన్‌లో కలిసిపోయింది. పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత

ఆయన తాతలు ఆదిలాబాద్ వచ్చేసి స్థిరపడ్డారు. నిజాంల కాలంలో వారి పెద్దనాన్నలు వారి వద్ద ఉద్యోగులుగా ఉన్నారు. ఆయన తండ్రి ఆదిలాబాద్ జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్యాంటిన్ నడిపేవారు. చిన్న తనం నుంచి బొమ్మలు చేయడమంటే చాలా ఇష్టం. చెక్క, కొయ్య, మట్టితో వివిధ రకాల బొమ్మలు తయారు చేసేవారు. 1972లో హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో శిల్పకళలో డిప్లమో కోర్సు పూర్తి చేశారు. గతంలో హనుమాన్ వ్యాయామశాల నడిపారు. కర్రసాము నేర్చుకున్నారు. కర్రసాములో పదిమందినైనా ఒక్క చేత్తో ఆపగలరు. ఆయనను ఎంతగానో అభిమానించే శిష్యులు ఉన్నారు. 63సంవత్సరాల రవీంద్రశర్మ గారికి ఒక కొడుకు. చెన్నైలో ఉంటారు. కూతురు ఆదిలాబాద్‌లోనే చదువుకుంటుంది.

వ్యాపారుల కోసమే ఈ అభివృద్ధి

మన దేశంలో ప్రతి 40 కిలోమీటర్లకు భాష, వేషం, భోజనం, భవనం మారిపోతుంది. సుమారు 360 కులాలు ఉంటే వారి వేషధారణ బట్టి కులాన్ని చెప్పేయవచ్చు. గతంలో మాదిరిగా నేడు పల్లెలు లేవనేది ఆయన వాదన. ప్రస్తుతం గ్రామాల్లో సైతం పాశ్చాత్య సంస్కృతి వచ్చేసింది.దాంతో ఉపయోగించే వస్తువులు మారిపోయాయి. భోజనం మారిపోయింది. వేషధారణ మారిపోయింది. అందుకే ఈ కళాశ్రమాన్ని ప్రారంభించి అంతరించిపోతున్న పల్లె వస్తుసముదాయాన్ని భద్రపరుస్తున్నారు. పాశ్చాత్య సంస్కృతి, అనుకరణ నేడు బాగా పెరిగిపోయింది. ఒకరిని చూసి మరొకరు వేసుకునే బట్టలో మార్పుచేసుకుంటున్నారు. ఎవరికీ సొంత ఆలోచనలు లేకుండా పోయాయి. ఈ మార్పునే మన వారు అభివృద్ధి అనుకుంటున్నారు. దీన్నే ఆధునిక సమాజం అని ముద్దుగా

పిలుచుకుంటున్నాం. కాని ఈ అభివృద్ధి కేవలం వ్యాపారం చేసేవాళ్ళకు మాత్రమే ఉపయోగపడుతుందని రవీంద్రశర్మ అంటున్నారు. ప్రభుత్వం కూడా కచ్చా ఇంటికి లోన్ అడిగితే ఇవ్వరు. పక్కా ఇంటికి మాత్రమే లోన్ ఇస్తామంటారు. పక్కా ఇళ్లే గట్టిదంటారు. ఎన్నో వేల సంవత్సరాల క్రితం నిర్మించిన చార్మినార్, పార్లమెంట్ వేటితో కట్టారో ఈ ప్రభుత్వానికి తెలియదా? అని ఆయన ప్రశ్నిస్తున్నారు.

చేతి వృత్తులను మరుస్తున్నారు

గతంలో చిన్న పరిశ్రమలు ఎక్కువగా ఉండేవి. ఆ పరిశ్రమలు వ్యక్తి కోసం వారి సమయానికి, అవసరానికి తగినవిధంగా వస్తువులు తయారు

కళాశ్రమ దర్శనమో సౌందర్యానుభూతి

చైత్ర మాసం వసంత శోభను సంతరించుకుని ఉదయరాగాన్ని ఆలపించే కోయిలలతో, విపారిన పూల సౌందర్యంతో వింతయిన వింతయిన పరిమళాన్ని పంచే వేప వృక్షాలతో మనకు స్వాగతం పలుకుతూ ఆహ్వానించే దృశ్యం ఆదిలాబాద్ జిల్లా అంతా కానవచ్చే ఓ సుందర దృశ్యం. ఇదే అనుభూతిని మనలోకి నెమ్మది నెమ్మదిగా వ్యాపింపచేస్తుంది ఆదిలాబాదు పట్టణంలోనే వున్న 'కళాశ్రమం'. పట్టణానికి చివరగా వున్న కళ్యాశ్రమం తీర్చిదిద్దిన శిల్పంగా కొలువుదీరి మొదటది చూపలోనే మనల్ని సమ్మోహనపరుస్తుంది.

లోపలికి ప్రవేశించగానే గుబురుగా పెరిగిన వృక్షాలు, కేవలం వెదురు బొంగులతో ప్రత్యేకంగా రూపొందించిన సమావేశ స్థలం ఇంకొంచెం లోపలికి వెళ్ళగానే గిరిజన, జానపద, గ్రామీణ జీవితపు ఆనవాళ్ళుగా నిలిచిన అనేక కళాకృతులు ఒక వరసక్రమంలో పేర్చబడి కళ్ళు చెదిరే సౌందర్యంతో మనల్ని మోహపరవశుల్ని చేస్తాయి. ఆ పక్కనే మట్టితో తయారుచేసిన కళాఖండాలు వివిధ దశల్లో వుంటాయి. మరోపక్క సమావేశ స్థలంలో జ్ఞానజ్యోతికి సంకేతంలా ఒక చిన్న దీపం ప్రకాశిస్తూ వుంటుంది. ఇదీ ఆదిలాబాదు పట్టణంలోని రవీంద్ర కళాశ్రమాన్ని దర్శించగానే మనకు కలిగే ఒక దివ్యానుభూతి.

ఈ కళాశ్రమ రూపశిల్పి శ్రీ రవీంద్ర శర్మ వృత్తిరీత్యా శిల్పే అయినా (ఆయన ఫైన్ ఆర్ట్స్‌లో కోర్సుల్ని జెఎన్‌టియూలోనూ, బరోడాలోనూ చేశారు) ఆయన మనసంతా ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ గిరిజన సౌందర్యాన్ని, అక్కడి కళల్ని, కళానైపుణ్యాన్ని గమనించటంలోనూ, శోధించటంలోనూ నిమగ్నమయింది. ఒక్కసారి ఆయన్ని పలకరిస్తే చాలు భారతీయ సంస్కృతి, ఆచార్య వ్యవహారల్లోని క్రమశిక్షణ మొదలుకుని ఒకప్పుడు పటిష్ఠంగా వున్న ఆర్థిక వ్యవస్థ పాశ్చాత్య సంస్కృతి మోజులో ఈరోజెలా చిందర వందరగా చిన్నాభిన్నంగా తయారయిందో ఒక ప్రవాహంలా చెప్పే వారి పలుకులు మనల్ని చుట్టుముడతాయి. వెంటాడతాయి.

వారి అభిప్రాయాలతో మనం ఏకీభవించవచ్చు. ఏకీభవించకపోవచ్చు. వారి మాటల్లోని చిత్తశుద్ధిని మాత్రం శంకించలేం. ఆ చిత్తశుద్ధిని ప్రేరేపించే గ్రామీణ సౌందర్య ప్రేమికులు దేశం నలుమూలల నుంచి వలస పక్షుల్లా అక్కడ చేరతారు. చర్చలు, సమావేశాలు, ప్రణాళికలు అక్కడ నిత్యం ఆలోచనాత్మక సంగమంలా కళాశ్రమం ఎప్పుడూ భాసిస్తూవుంటుంది.

ప్రతి ఉగాదికి అక్కడ కొత్త ఉషస్సులు వికశిస్తూ వుంటాయి. ఒక ఉత్సవ సౌరభం వెలుగులీనుతూ మనల్ని ఆకర్షిస్తుంది. ఆరోజు గ్రామీణ గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలుంటాయి. గోష్ఠులు, చర్చలు, సమాలోచనలు ఒక సమ్యక్ దృష్టితో సాగుతాయి. ఒకానొక కాలంనాటి భారతీయ వెలుగుల్ని దర్శించాలనుకునే వారికి అచ్చెరువు కలిగించే వేదిక కళాశ్రమం. అలనాటి ఆ వెలుగుల్ని మళ్ళా సాకారం చేయాలనుకునేవారి ఆకాంక్షల ప్రతిరూపం కళాశ్రమం. గురూజీ అని అందరూ పిలుచుకునే రవీంద్ర శర్మగారితో సంభాషించడం తల్లడిల్లే మనసుకో స్వాంత్వన.

– సి.ఎస్. రాంబాబు

పురావస్తు శాఖవారు బాధ్యత తీసుకోవాలి

గురూజీ చాలా మంచి మనిషి. ప్రాచీన కళలన్నా, గ్రామీణ వాతావరణమన్నా ఆయనకు చాలా ఇష్టం. ఆయన వద్ద మేము ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. ఆయన గతంలో నడిపిన హనుమాన్ వ్యాయామశాలలో నేనూ ఒక విద్యార్థినే. చదువుకునే రోజుల్లో గురూజీ వద్దనే యోగా నేర్చుకున్నా. కర్రసాము కూడా నేర్చుకున్నా. ఆయన కర్రసాములో పదిమందినైనా ఆపగలడు. ఈ కళాశ్రమంలోని వస్తువులన్నీ గురూజీ స్వయంగా గ్రామ గ్రామానికి తిరిగి సేకరించారు. ఎంతో మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి ఎన్నో కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటున్నారు. గురూజీ పెద్దవారైపోతున్నారు. ఆయన తర్వాత ఈ ప్రాచీన వస్తువులన్నీ కాపాడబడాలంటే పురావస్తు శాఖ వాళ్ళు ఆశ్రమం బాధ్యత తీసుకోవాలి. అప్పుడే ఇవన్నీ కాపాడబడతాయి.

– రఘువీర్ యాదవ్, రిటైర్డ్ ఎమ్మార్వో, ఆదిలాబాద్

భవిష్యత్ తరాలకు ఉపయోగం

సమాజం నిరంతరం మారుతుంటుంది. చరిత్ర ఎంతో ఘనమైనది. దాన్ని కాపాడుకోవడానికి ఇటువంటి ఆశ్రమాలు, మ్యూజియంలు చాలా అవసరం. అలాగే పుస్తకాల రూపంలో కూడా భద్రపరచుకోవాలి. మన గత సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవడానికి రవీంద్రశర్మగారు స్థాపించిన కళాశ్రమం ఎంతో ఉపయోగపడుతుంది. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉంటుంది. సంస్కృతి అనేది మనిషి మనుగడకు ప్రేరణగా ఉండాలి. నేడు మారిని పరిస్థితులకు అనుగుణంగా మనుషులూ మారుతున్నారు. అది అనివార్యం. బ్రతకడానికి దూరదూర ప్రాంతాలకు వెళ్ళక తప్పడంలేదు. దాంతో అనివార్యంగా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. వీటన్నింటి గురించి గురూజీ చేస్తున్న కృషి వల్ల గతంలో మనమేంటి అనేది తరువాతి తరాలకు తెలుస్తుంది.

– ఉదారి నారాయణ,
తెలంగాణ రచయితల వేదిక, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు

చేసేవారు. కాని నేడు పెద్ద పెద్ద కార్ఖానాలు వచ్చి వస్తువుల కోసం జనాన్ని సృష్టిస్తున్నాయి. సమూహాల కోసం తయారు చేస్తున్నారు. అలాగే భారత దేశాన్ని అందరూ వ్యవసాయ దేశం అంటారు. కాని ఎంతో కాలం నుండి ఇక్కడ వృత్తిదారులు ఉన్నారు. చేతివృత్తులను పక్కన పెట్టి కేవలం వ్యవసాయ దేశంగా మార్చివేశారు. నేడు పట్నాల్లో చేస్తున్న ఎన్నో పనులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పల్లెల్లో కూడా చేసుకోవచ్చు. పల్లెల్లో వృత్తులు బ్రతకాలంటే లోకల్ మార్కెట్ ఏర్పాటు చేయడం చాలా అవసరం. మధ్యప్రదేశ్‌లోని 'చందేరి'లో చీరలు వారి గ్రామంలోనే అమ్ముడు పోతాయి. ఎందుకంటే అక్కడ వారికోసం ప్రత్యేకంగా లోకల్ మార్కెట్ ఉంది. కాబట్టి అక్కడ వారు ఆ చీరలను ఎక్కువగా నేస్తున్నారు. కాని మన రాష్ట్రంలో సిరిసిల్ల నేత రైతులు లోకల్ మార్కెట్‌లేక వారి ఉత్పత్తులు అమ్ముడు పోక, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

భవిష్యత్తులో మ్యూజియంలో చూసుకోవల్సిందే

ప్రస్తుతం గిరిజనులు బయటకు రావడానికి ఇష్టపడుతున్నారు. వారి భాషతో పాటు తెలుగు పూర్తిగా అంతరించి పోతుంది. గిరిజనులు, గోండులు అంటే ఇలా ఉండేవారని మ్యూజియంలో బొమ్మల రూపంలోచూసుకునే పరిస్థితి పాతిక సంవత్సరాల్లో వచ్చేస్తుందేమో అని గురూజీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాచీన వ్యవస్థను అర్థంచేసుకోవాలి

పెద్ద పెద్ద పట్టణాలు పెద్దపెద్ద ఫ్యాక్టరీల కోసమే ఏర్పడ్డాయి. ప్రజల కోసం కాదు. తెలంగాణలో నిజాంల కాలంలో 350 చెరువులు ఉండేవి. ఒక్క అదిలాబాద్ జిల్లాలోనే 16 చెరువులు, 60 నూతులు ఉండేవి. వాటిలో ఈతకొట్టేవారు. తోటలు వేసేవాళ్ళు. వాటి కోసం పెద్ద పెద్ద జాతర్లు జరిగేవి. మన వ్యవస్థను కాపాడుకోవాలంటే భారతీయ ప్రాచీన వ్యవస్థను తెలుసుకోవాలి. గతంలో మన విజ్ఞానం ఏమిటి, గతంలో వాడిన వస్తువులన్నీ ఎలా తయారు చేయబడ్డాయి. నగలు, బట్టలు, తిండి అన్నీ గతంలో కూడా ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా చేస్తున్నదేమిటి. మన శరీరాన్ని, ఇంటిని ఎలా కాపాడుకుంటామో అలా గ్రామాలను కాపాడుకోవాలి. సమాజంలో నివసించే ప్రాణి కోటి ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వర్తిస్తే సమాజం బాగుపడుతుంది. పక్షులు, చెట్లు వాటి పని అవి చేస్తున్నాయి. ఒక్క మనిషి మాత్రమే తన కర్తవ్యాన్ని సరిగా నిర్వర్తించడం లేదు. అలా నిర్వర్తించినపుడే నిజమైన అభివృద్ధి. పాశ్చాత్య విజ్ఞానం అనే ప్రమాదం వచ్చిపడింది. దాని నుండి భారతీయ సంస్కృతిని కాపాడుకోవటానికి ప్రయత్నించాలి. మనిషికి ఆహార భద్రత ఉంటే ఎలాంటి జీవితం గడపాలో ఆలోచించగలుగుతాడు. కడుపు నిండకపోతే జీతం గురించే ఆలోచిస్తాడు.

గ్రామీణ సాంప్రదాయనకు నెలవు

ఆశ్రమంలోకి అడుగు పెడితే ఒక గ్రామంలోకి అడుగుపెట్టినట్లు ఉంటుంది. 1979లో సొంత ఇంటిలో ఈ ఆశ్రమాన్ని ప్రారంభించారు. తర్వాత స్థలం సరిపోక 1985, 86లో ప్రభుత్వాన్ని కోరితే ప్రస్తుత ఆశ్రమం ఉన్న స్థలాన్ని ఇచ్చారు. పురాతన వస్తువులు భద్రపరిచిన ప్రదేశపు తలుపుతీసుకుని అడుగుపెట్టిన వెంటనే ఆయన, ఆయన శిష్యులు స్వయంగా మట్టితో వివిధ ఆకారాలలో ఎంతో అందంగా తయారు చేసిన దీపపు కుందీలు దర్శనమిస్తాయి. ప్రతీ దీపావళికి దీపాలు వెలిగించి శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. పాత కాలంలో ఉపయోగించిన

రకరకాల లాంతరులు సేకరించి పెట్టారు. వీధి దీపాలుగా ఉపయోగించే కందిలీ, చిమ్నీని భద్రపరిచారు. యడ్లబండి చక్రానికి మధ్యలో పెట్టే 'కమ్ములు' ఉన్నాయి. చేతితో తయారు చేసిన నాటి తాళం కప్పలు. ధాన్యం కొలుచుకోవడానికి గతంలో వాడిన పురాతన వస్తువులు దర్శనమిస్తాయి. నాటి కాలంలో మోట బావి నుండి నీళ్ళు తోడే 'యాతం', వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు. ధాన్యం కొలిచే గుమ్మి. గిరిజనులు సాంప్రదాయ సంబరాల్లో దండోరాకు ఉపయోగించే వారి ఆరాధ్య దేవతల ఆకారాలు చెక్కతో తయారు చేసి ఉన్నాయి. వాటిని'గుసాడి' అని పిలుస్తారు. ఆశ్రమం పై కప్పు మొత్తం 'కుమ్మరి గూన'తోనే కప్పబడి ఉంది. దానిని బట్టి చేతి వృత్తులకు ఆయన ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతుంది. ఆయన నివాసం ఉండే గది సైతం కుమ్మరి గూన పెంకులతోనే కప్పబడి ఉంది. ఆయన మంచి పెయింటర్ కూడా. గత రెండు సంవత్సరాల క్రితం వరకు ఆదిలాబాద్‌లోని స్థానిక పాఠశాలలో పెయింటింగ్ టీచర్‌గా పనిచేశారు. రవీంద్రశర్మ వద్ద బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్న విద్యార్థులు మట్టితో కొమురం భీం విగ్రహాన్ని చేశారు. విసురురాయితో సహా గ్రామాలలో లభించే ప్రతి వస్తువు ఆశ్రమంలో భద్రపరిచారు.

ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు

ప్రస్తుతం ఆశ్రమ ఆర్థిక అవసరాలన్నీ ఆయనే చూసుకుంటున్నారు. ఆశ్రమంలో కరెంటు బిల్లు తప్పా పెద్దగా ఖర్చులేవీ ఉండవట. ఎవరినీ చందాలు అడగడం ఇష్టలేదాయనకు. ఇప్పుడున్న ఆశ్రమాన్ని ఇంకాస్త అభివృద్ధి చేసి ఇనుము నుండి పేపర్ వస్తువు వరకు ఎలా తయారయ్యిందో తెలిపే విధంగా ఒక మ్యూజియంను ఏర్పాటు చేయాలనుకుటున్నారు. త్వరలో అంతరించి పోబోతున్న గ్రామీణ వస్తుసముదాయాన్ని, చేతి వృత్తులను భద్రపరిచే నిలయంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దుతానంటున్నారు. ఇవన్నీ చందాలు లేకుండా ఎలా చేయగలరని ప్రశ్నిస్తే, వాటి విలువ తనకు తెలిసింది కాబట్టి ప్రస్తుతం తాను కాపాడుతున్నారు. భవిష్యత్తులో వీటి విలువ తెలిసిన వాళ్ళు ఎవరో ఒకరు వాళ్ళే వచ్చి ఈ ఆశ్రమాన్ని కాపాడుకుంటారని చెబుతున్నారు.

'గ్రామీణ్ వికాస్' చర్చలు జరుగుతాయి

రవీంద్రశర్మ నేర్చుకున్న వన్నీ ఆసక్తి ఉన్న వాళ్లు వచ్చి ఆయన దగ్గర నేర్చుకుంటూ ఉంటారు. తను మాత్రం ఎవరినీ పిలిచి నేర్చుకోమని అడగరు. చాలా తక్కువ అన్నం తీసుకుంటారు. 5:30 గంటలకు నిద్రలేస్తారు. గేదెలు ఉన్నాయి. వాటిని భార్య చూసుకుంటారు. మీ తర్వాత ఆశ్రమం బాధ్యతలు ఎవరు చూసుకుంటారంటే, ఇవన్నీ చేయటానికి ఎవరు మాత్రం బాధ్యత తీసుకుంటారు, ఎవరు కాపాడాలకుంటే వాళ్ళే వచ్చి చూసుకుంటారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాల నుండి గ్రామీణ ప్రాంతాలను కాపాడాలి అనుకునే విద్యార్థులు 'గ్రామీణ వికాస్' పేరుతో ప్రతీ ఉగాదిన మూడు రోజుల పాటు ఆశ్రమానికి వచ్చి ప్రస్తుత గ్రామీణ పరిస్థితుల గురించి చర్చలు జరుపుకుంటారు. ఎవరి భోజన సౌకర్యం వాళ్ళే చూసుకుంటారు. గతంలో మార్కెట్ అందరికి అందుబాటులో ఉండేది. ఇప్పుడు అవి కబ్జాచేయపడ్డాయి. పరిశ్రమలు చిన్నగా, కుటుంబాలు పెద్దగా ఉండేవి. ఇప్పుడు కుటుంబాలు చిన్నవైపోయాయి పెద్దపెద్ద పరిశ్రమలు తయారయ్యాయి. దాంతో కుటుంబం నుండి వ్యక్తులు వేరుచేయబడ్డారు. గ్రామాల్లో దొరుకుతున్న పనులన్నీ లేకుండా చేశారని చెబుతున్నారు గురూజీ.

సొంత నిర్ణయాలు లేవు

గ్రామాలలో విజ్ఞానం, ఆధ్యాత్మికం, కళలు, సామాజిక, అర్థశాస్త్రం ఉండాలి. అవన్నీ ఉంటేనే గ్రామాలు. గ్రామాలు విలసిల్లే కాలంలో పోలీసులు లేరు. దుకాణాలు లేవు. హోటళ్ళు, లాడ్జీలు లేవు.ఇవన్నీ లేనప్పుడు ప్రజలు తినలేదా? అంటున్నారు. ఊళ్ళో బతికే ప్రజలు 18 రకాల పనులు చేసుకునేవాళ్ళు. ప్రస్తుతం జనం ఏమి తినాలి? ఏమి ధరించాలి? అనే నిర్ణయాలు పెద్ద పెద్ద వ్యాపారులు నిర్ణయిస్తున్నారు. ఎవరికైనా పని అనేది బతకడానికి. అది ఆహార భద్రతను, సమానమైన గౌరవాన్ని కల్పించాలి. అప్పులు చేస్తే తప్పా బ్రతుకు గడవడం లేదు. నేడు జనం సంపాదించినదంతా బ్యాంకులకు కట్టాల్సి వస్తుంది. సొంతగా బతకలేని పరిస్థితి వచ్చింది. ఇది మారాలి.

నోటుకు విలువ

పూర్వం ధనం ఎనిమిది రకాలుగా ఉండేదని గురూజీ అంటున్నారు. ధనం, ధాన్యం, పశువు, గోధన్, గజధన్, అజ్ధన్, అశ్వధన్, విద్య, వీటిలో ఏమున్నా అప్పట్లో ధనవంతుడే. గతంలో ధాన్యం ఆడవాళ్ళ చేతిలో ఉండేది. కుటుంబం కడుపు నిండా తిండి తినేది. ఎప్పుడైతే నోటు మగవాడి చేతికి వచ్చిందో అప్పటి నుండి విలాసాలు, దావత్‌లు పెరిగిపోయాయి. దాంతో కుటుంబం గడవడం కష్టమైపోయింది. ప్రస్తుతం అదే నోటు ఆడవాళ్ళ చేతికి వస్తే బ్యూటీపార్లర్‌కి పెడుతున్నారు. నా సంపదన నేనేమైనా చేసుకుంటా అనే వాదన ముందుకు వచ్చింది. పెద్ద పెద్ద కార్ఖానాలు పెరిగిన తర్వాత నోటు ఒక్కటే ధనంగా మారిపోయింది. ధాన్యానికి విలువ ఉన్నంత కాలం ఇవన్నీ చేయడానికి అవకాశం లేదు. దీన్ని అందరూ అర్థం చేసుకోవాలి.

సాంకేతిక పరిజ్ఞానం సమాజ పరమవ్వాలి

ఇప్పటికే కోలాటం, భాగవతాలు మాయమైపోయాయి. ప్రభుత్వం గ్రామీణ చరిత్ర, సాంప్రదాయం, వస్తుసముదాయం లాంటి వాటిని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా డాక్యుమెంటేషన్ చేయాలి. అప్పుడు అవి కాపాడబడతాయి. అలాగే గ్రామాలు బాధ్యత తీసుకొని లోకల్ మార్కెట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. గతంలో వృత్తులు చేసుకునే వాళ్ళు ఇప్పుడు కమీషన్ ఏజెంట్లుగా మారిపోయారు. గతంలో సాంకేతిక పరిజ్ఞానం సామాన్య ప్రజానీకం చేతిలో ఉండేది. కాబట్టే ఎన్నో కొత్త కొత్త రకాల వస్తులు ఎప్పుడో తయారు చేశారు. ఇదివరలో చదువు సమాజం దగ్గర ఉండేది. ఇప్పుడు చదువుతున్న చదువులన్నీ సమాజానికి ఉపయోగపడే చదువులు కాదు. గ్రామంలో తయారు చేయబడిన ప్రతి వస్తువు

కళా దార్శనికుడు... గూరుజీ

ప్రత్యామ్నాయ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అతని స్వప్నం. కనుమరుగవుతున్న చేతివృత్తులను మనుగడలోకి తేవాలనేది అతని ధ్యేయం. ఆదివాసుల అపూర్వ కళా నైపుణ్యలను, సంస్కృతిని కాపాడాలనేది అతని సంకల్పం. అతను ఎవరో కాదు కళాశ్రమం రవీంద్రశర్మ గారు. అతన్ని గౌరవంగా 'గురూజీ' అని పిలుస్తారు.



సామల సదాశివ, రవీంద్రశర్మ (గురూజీ)

నాకు ఆదిలాబాద్ పట్టణమంటే ఇద్దరు మదిలో మెదులుతారు. ఒకరు సాహితీశిఖరమైన సామల సదాశివ గారైతే మరొకరు గురూజీ. ఆసక్తి కలిగించే విషయం ఇద్దరు మంచి మిత్రులు. వారి ముచ్చట్లు వింటే చాలు ఎంతో నేర్చుకుంటాం. గత దశాబ్దకాలంలో నేను చాలా సార్లు కళాశ్రమంలో అడుగుపెట్టాను. వెళ్ళిన ప్రతిసారి కొత్తగా అనిపిస్తుంది. ఆయన ముచ్చట్లు సాగుతూనే ఉంటాయి. 'ఔర్ క్యాహే? ఔర్ క్యాహే?' అంటూ మాటల ప్రవాహం సాగుతుంది. ఒక్కసారి ఆయన ముచ్చట నన్ను బాగా ఆకట్టుకున్న ముచ్చట చేప్త. చీకటి పడుతుంది. ఆశ్రమంలో పదిమంది దాక ఉన్నారు. అప్పుడు ఆయన అన్నారు కదా ' ఏమిటి ఈ లోకం. చాలా చిత్రమైంది. ఎప్పుడు చటపటలాడుతారు. పరిచయస్తులు ఎదురుపడినా ముఖాలు మాడ్చుకుంటారు. పలకరించవచ్చు కదా అని. తులసిదాస్ తన పుస్తకంలో ఒక మాటన్నడు. ఎవరైన ఎదురుపడితే నవ్వుతూ పలకరించి చూడు చాలు. నీకు సగం శత్రువులుండరని. దీన్ని పాటిస్తే ఎంతబాగుంటది కదా' నాపై చాలా ప్రభావం చూపింది ఈ మాట.

నేటి గ్లోబలీకరణకు విరుగుడు లోకలీకరణ అంటారు ఆయన. అంటే స్థానిక మార్కెట్లను బలోపేతం చేయాలనేది అతని ఉద్దేశం. ఒక గ్రామం మనుగడ ఎట్లా సాగింది. ఇప్పుడు ఎట్లా పతనమౌతుంది వివరంగా చెప్పగల సామాజిక రాజకీయ ఆర్థిక వేత్త ఆయన. బరోడా యూనివర్సిటీ నుండి పట్టా తీసుకున్న ఆయన ఈ జిల్లాలోని కొలాముల, గోండుల, ఓజాల నేర్పరితనానికి ఆకర్షితుడైనాడు. ఇక్కడే ఉండి వారిలో నైపుణ్యాల్ని పెంచాలని, వారికి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారు. వెదురుతో, మట్టితో అద్భుతాలను చేపి చూపారు. నిరాండబరమైన జీవనశైలి అతనిది. కళాశ్రమంకు ఎప్పుడైన పోవచ్చు. నేనైతే ఒక సారి ఉట్నూరు నుండి మా సార్ వాళ్ళు వస్తే ఉదయం ఆరుగంటలకే వెళ్ళాను. ఐనా ఆయన శ్రమ అనుకోకుండా నాతో వచ్చిన వాళ్ళతో ముచ్చట చెప్పిండు. ఒకసారి సుద్దాల అశోక్‌తేజ వస్తే వెళ్ళాము. ఆత్మీయంగా పలకరించి వర్తమాన అంశాలపై ముచ్చట్లు చెప్పారు. అశోక్‌తేజ గారు పాడిన అనేక పాటలను విని ఆనందించారు.

కళాకారుల పాదముద్రలతో విరాజిల్లుతున్న హస్తకళల క్షేత్రం కళాశ్రమం. సమస్త కులాల పుట్టుపూర్వోత్తరాల ఆనవాళ్ళ చరిత్రలు అక్కడ ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధిపొందిన గురూజీ బోధనలు అందరికి అందుబాటులోకి రావల్సి ఉంది. ఆయనొక శిల్పిగా అనేక రూపాలను తయారు చేయవచ్చు కాని ఆయన దార్శనికత చాలా గొప్పది. ప్రతిదాన్ని చాలా నేర్పుగా చెప్పగల ఆచార్యుడతడు. గొప్ప మానవ ప్రేమికుడు. అప్పుడప్పుడైన ఆయన ముచ్చట్లు వినే ఆవకాశం కలిగింది. కళాశ్రమం ఆదిలాబాద్ కొక వరమంటే అతిశయోక్తి కాదు. మన చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలబడింది. ఆయన సేకరించిన అరుదైన వస్తువుల మ్యూజియమది. కళా దార్శనికుని ముచ్చట్లను భావితరాల కోసం రికార్డు చేయాలి. అప్పుడే పదికాలాల పాటు ఉంటాయి.

- గోపగాని రవీందర్

గ్రామంలోని జనానికి ముందు ఉపయోగపడాలి. పత్తి పండిస్తే దాని నుండి గింజల్ని తీసే యంత్రం గ్రామంలో ఏర్పాటు చేయాలి. వాటిని పిండి చేసేదాన్ని తెచ్చుకోవాలి, నూనె తయారు చేసే పరికరాన్ని టెక్నాలజీని ఉపయోగించి గ్రామంలోనే తయారుచేసుకోవాలి.

ఏ గ్రామంలోనైతే విజ్ఞానం, ఆధ్యాత్మికం, కళ, సామాజిక వికాసం ఉంటే అది మంచి గ్రామంగా తయారవుతుంది. గతంలో బట్టలు కుట్టాలంటే మనిషిని చూసి కొలతలతో కుట్టేవాళ్లు. కాని ఇప్పుడు ఆ టెక్నాలజీ మొత్తం బ్రహ్మ విద్య అయిపోయింది. ఏది ఎలా వాడుకోవాలి, ఎంత వాడుకోవాలి అనేది అవగాహన ఉండాలి. ఏ వస్తువు వల్ల ఎటువంటి ఉపయోగం ఉంటుంది తెలుసుకోవాలి.

గ్రామాలను కబ్జాచేశారు

ఈస్ట్ ఇండియా కంపెనీ స్కూళ్ళ గురించి ఒక సర్వే చేసింది. సూరత్ ప్రెసిడెన్సీ, మద్రాస్ ప్రెసిడెన్సీ, బెంగాల్ ప్రెసిడెన్సీ,కర్నాటకా ప్రెసిడెన్సీ ఈ సర్వేని జరిపాయి. ప్రతి ఊర్లో బడి, గుడి, సత్రం ఉండేది. వీటిని నడపడం కోసం పండించిన ధాన్యంలో జనం మూడుగా విభజించుకున్నారు. వారి సర్వేలో భూమిపై ఆదాయం బాగా వస్తుందని తేలింది. దాంతో 60 నుండి 90 శాతం శిస్తు వసూలు చేయడం ప్రారంభించారు. శిస్తు ఎక్కువ కావడంతో బడి, గుడి, సత్రం నడపడం కష్టమైపోయింది. అప్పటి నుండి పాత విద్యా విధానం స్థానంలో కొత్త విద్యా విధానం వచ్చేసింది. శిస్తును కాపాడడం కోసం జమీందారి విధానం వచ్చింది. వారిని కాపాడడం కోసం పోలీసులు వచ్చారు. ఎవరైనా శిస్తు కట్టకపోతే వారిని హింసించడం మొదలు పెట్టారు. అప్పటి నుండి జమిందార్లు గ్రామాలను కబ్జాచేశేశారు. ప్రస్తుతం సంధి కాలంలో ఉన్నాం. ఒక వ్యవస్థ నాశనం అయి మరో వ్యవస్థ వస్తుంది. గ్రామాలు కావాలంటే పట్టణాలను వదులుకోవాలి. పట్టణాలు కావాలంటే గ్రామాలను వదలాలి. కానీ మనుషులు వేటినీ వదలనంటున్నారు. సంస్కరణలు మొత్తం పెద్ద పెద్ద కార్ఖానాల కోసమే వచ్చాయి.

గ్రామ సీమలను కాపాడాలనుకునేవారు, ఆదివాసీల కళలను తెలుసుకోవాలని భావించే వారు, మన గరించి మనం తెలుసుకోవాలంటే ఆదిలాబాద్‌లోని ఈ ఆశ్రమాన్ని ఒక్కసారి సందర్శించవల్సిందే. గ్రామసీమల హస్తకళల గురించి అధ్యయనం చేసే విద్యార్థులు రాబోయే ఉగాదినాడు అక్కడ జరగబోయే చర్చల్లో తప్పక పాల్గొంటే ఎంతో విజ్ఞానాన్ని పొందినవారవుతారు.

- ఎస్.కె సలీమ, 9490099083

ఫోటోలు: కృష్ణ

శ్రమించాడు సాధించాడు

సురేష్ రైనా, రాబిన్ ఉతప్ప, దినేష్ కార్తీక్, ఇర్ఫాన్ పఠాన్, శిఖర్ ధావన్.. వీరంతా ఒకప్పుడు అండర్-19 జట్టులో తెలుగు తేజం అంబటి తిరుపతి రాయుడి సారథ్యంలో ఆడినవారే. తన కెప్టెన్సీలో ఆడిన ఆటగాళ్లందరూ అనతికాలంలోనే టీం ఇండియా జెర్సీ ధరించగా..రాయుడు మాత్రం సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. కెరీర్‌లో ఎన్నో అడ్డంకులు, మరెన్నో ఆటుపోట్లు ఎదురైనా మొక్కవోని కఠోర దీక్షతో శ్రమించిన రాయుడు..తుదకు తను అనుకున్నది సాధించాడు. ప్రపంచకప్‌లో భారత్ తరపున ఆడాలనే ఆశయాన్ని నేరవేర్చుకోనున్నాడు.

టీం ఇండియాలో చోటు దక్కించుకోవాలంటే దక్షిణాది రాష్ట్రాల, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్ర క్రీడాకారులకు అందని ద్రాక్షే. ప్రతిభ ఉన్నా జాతీయ జట్టులో చోటు సాధించాలంటే ఇంకేదో చేయాల్సిన దుస్థితి. దిగ్గజ ఆటగాడు వి.వి.ఎస్. లక్ష్మణ్ తర్వాత హైదరాబాద్ నుంచి వెలుగులోకొచ్చిన మరో యువ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడిదీ సరిగ్గా ఇదే పరిస్థితి. అసమాన ప్రతిభావంతుడిగా కెరీర్ ఆరంభంలోనే ప్రశంసలందుకున్నా..భారత జట్టు ద్వారాలు మాత్రం అంత సులభంగా తెరుచుకోలేదు. 2001-02 దేశవాళీ సీజన్‌లో హైదరాబాద్ తరపున ఆరంగేట్రం చేసిన రాయడు..అనతికాలంలోనే తర్వాతి తరం సచిన్‌గా పేరొందాడు. మైదానం లోపలా, వెలుపల జరిగిన కొన్ని సంఘటనలు రాయుడి కెరీర్‌ను తిరోగమనంలోకి నెట్టేశాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌తో గొడవ దీనికి మరింత ఆజ్యం అయ్యింది. 2005లో ఆంధ్రాకు రంజీల్లో ఆడినా..నిరుత్సాహకర ప్రదర్శన కారణంగా తర్వాతి ఏడాదే తిరిగి హెచ్‌సిఏ గూటికి చేరుకున్నాడు.

రాయుడి కెరీర్‌పై ప్రతికూల ప్రభావం చూపిన నిర్ణయం..రెబల్ క్రికెట్ లీగ్ ఐసీఎల్‌లో చేరటం. తన కంటే జూనియర్లందరూ టీం ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. దేశవాళీలో రాణిస్తున్నా సెలక్టర్ల మెప్పు కరవవటంతో రాయుడు రెబల్ క్రికెట్ లీగ్‌లో చేరాడు. దీంతో భారత క్రికెట్‌లో ఆడకుండా రెండేళ్ల పాటు నిషేధం విధించింది బిసిసిఐ. 2009లో ఐసీఎల్‌తో కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకున్న అనంతరం మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో పునరాగమనం చేసిన రాయుడు..బరోడా జట్టులో చేరాడు. బరోడా తరపున ఆడిన తొలి సీజన్‌లో 56.60 సగటుతో 566 పరుగులు బాదిన రాయుడు..తర్వాతి సీజన్‌లో 60.54 సగటుతో 666 పరుగులు సాధించాడు. 2012-13 దేవ్‌ధర్ ట్రోఫీలో టాప్ స్కోరర్‌గా నిలవటమే కాకుండా ఫైనల్స్‌లో నార్త్ జోన్‌పై అజేయంగా 78 పరుగులు చేసి జట్టుకు ట్రోఫీ అందించాడు.

ఐసీఎల్‌లో చేరటం కెరీర్‌కు ప్రతిబంధకం కాగా..బిసిసిఐ లీగ్ ఐపీఎల్ రాయుడికి క్రికెటర్‌గా జీవం పోసింది. ప్రతిభావంతుడైన క్రికెటర్‌గా సచిన్ మన్ననలు పొందిన తెలుగు తేజం..2010 నుంచి సచిన్ నేతృత్వంలోని (ప్రస్తుతం మెంటర్) ముంబయి ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్‌లో ఇప్పటివరకూ ఆడిన ఐదు సీజన్లలోనూ రాయుడు తనదైన ముద్ర వేశాడు. ఐపీఎల్ తర్వాత జరిగే ప్రతి భారత పర్యటనకూ రాయుడి పేరు వినిపించేదంటేనే అతడి ప్రదర్శన ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ట్వింటీ20 సిరీస్‌లో బ్యాట్స్‌మన్ మనోజ్ తివారీ గాయంతో స్వదేశానికి రావటంతో..అతని స్థానంలో రాయుడిని ఎంపిక చేసింది సందీప్ పాటిల్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటి. చీఫ్ సెలక్టర్‌గా ప్రతిభకే పట్టం కట్టిన ఘనత సాధించిన సందీప్ పాటిల్ కూడా ఐసీఎల్‌తో అనుబంధాన్ని కలిగియున్నాడు. 2012లో శ్రీలంకలో జరిగిన టి20 ప్రపంచకప్ ప్రాబబుల్స్‌లో చోటు సాధించినా..తుది 15 మందిలో స్థానం పొందలేకపోయాడు. దేశవాళీ ప్రదర్శనతో భారత జట్టుకు ఎంపికవుతూ వచ్చినా..అంతర్జాతీయ ఆరంగేట్రానికి మాత్రం రాయుడు ఎదురుచూడక తప్పలేదు. 2013 జింబాంబ్వేతో వన్డే సిరీస్‌లో కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని గాయంతో జట్టులోకి వచ్చిన రాయుడు..జులై 24న తొలి వన్డే మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో అజేయంగా 63 పరుగులు చేసిన రాయుడు స్టాండింగ్ కెప్టెన్ కోహ్లి (సెంచరీ చేశాడు)తో కలిసి జట్టుకు విజయాన్నందించాడు. జింబాంబ్వేపై తొలి మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించి..ఆరంగేట్రంలోనే అర్థ సాధించిన 12వ భారత ఆటగాడిగా నిలిచాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా (2013), న్యూజిలాండ్ (2014), ఆసియా కప్ (2014), 2014 టి20 ప్రపంచకప్‌లలో రాయుడు ఆడాడు. ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై అర్థ సెంచరీ సాధించినా, ఆ వెంటనే జరిగిన బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో (3 మ్యాచ్‌ల్లో 18 పరుగులు) నిరాశపరిచాడు.

భారత్ తరపున 20 మ్యాచ్‌ల్లో ఆడినా..రాయుడి ప్రత్యేకత కనిపించలేదు. జట్టుకు ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ..మిడిల్ ఆర్డర్‌లో రహానే, రైనా, ధోనిల మెరుపులు ముందు రాయుడి ఇన్నింగ్స్ ప్రత్యేకత సంతరించుకోలేదు. అయితే మొతారే ఇన్నింగ్స్..అంబటి కెరీర్‌నే మార్చివేసింది. శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో తొలిసారి మూడోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రాయుడు..అజేయ శతకం సాధించాడు. ఈ ఒక్క సెంచరీ రాయుడుని జట్టులో ఉండేలా చేసింది. మిడిల్ ఆర్డర్‌లో నమ్మదగిన బ్యాట్స్‌మన్‌ను చేసింది. ఆ తర్వాత ఆఖరి వన్డేలోనూ అజేయంగా నిలిచి అర్థ సెంచరీ బాదాడు. దీంతో వన్డే జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవటమే కాకుండా 2015 ప్రపంచకప్ భారత జట్టులో చోటు సంపాదించాడు. జాతీయ జట్టులో చోటు కోసం సుదీర్ఘంగా దశాబ్ద కాలం ఎదురుచూసిన ఈ హైదరాబాదీ బ్యాట్స్‌మన్.. అబిద్ అలీ (1975), మహ్మద్ అజహరుద్దీన్, (1987, 1992, 1996,1999), వెంకటపతి రాజు (1992, 1996)ల తర్వాత ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నాల్గో క్రికెటర్‌గా ఘనత వహించాడు.

- శ్రీనివాస్ దాస్ మంతటి, 9676340133

ప్రపంచకప్ జట్టుకు ఎంపికైన తెలుగు తేజం

ప్రొఫైల్

పేరు : అంబటి తిరుపతి రాయుడు
భార్య : చెన్నుపల్లి విద్య
తల్లిదండ్రులు: సాంబశివరావు, విజయలక్ష్మి
స్వస్థలం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్
జన్మదినం : 23 సెప్టెంబర్, 1985
బ్యాటింగ్ : కుడి చేతి బ్యాట్స్‌మన్
బౌలింగ్ : ఆఫ్ స్పిన్నర్
ఆరంగేట్రం : జింబాంబ్వేపై (2013)

పాలో కోయిలో కొటేషన్స్

★ నిర్ణయం తీసుకోవటమన్నది ఆరంభం మాత్రమే. ఎవరైనా నిర్ణయం తీసుకున్నారంటే అది ఉధృతమైన ప్రవాహంలోకి దూకటం లాంటిది. ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు ఊహించనైనా ఊహించని ప్రదేశాలకు ఆ ప్రవాహం వారిని తీసుకెళుతుంది.

★ మనుషులు ప్రతి సూర్యోదయంలోనూ తమకు జరుగుతున్న మంచిని గుర్తించకపోవడం వల్ల ప్రతిరోజూ మాదిరిగానే మరుసటి రోజు ఉంటుంది.

★ ఎవరైనా తమ కలను సాకారం చేసుకునే ప్రయత్నం చేస్తుంటే వారు విజయం సాధించడానికి ఈ విశ్వమంతా ఆ వ్యక్తికి సహాయపడటానికి ప్రయత్నిస్తుంది.

★ కలను సాకారం చేసుకోవటాన్ని అసాధ్యం చేసేది ఒక్కటే; అది విఫలమవుతామేమోనన్న భయం.

★ ఒక వ్యక్తి తన జీవన గమ్యాన్ని అనుసరించటాన్ని ప్రేమ ఎన్నటికీ ఆపదు. ఒకవేళ ఆ అన్వేషణని వదిలిపెట్టాడంటే అది విశ్వభాష మాట్లాడే నిజమైన ప్రేమ కాదు.

★ బాధపడటం కంటే బాధ పడతామేమోనన్న భయం దారుణమైనది.

★ సాధారణంగా ప్రాణభయం మనుషులను తమ జీవితం పట్ల మరింత ఎరుక కలిగేలా చేస్తుంది.

★ చాలామంది ప్రపంచాన్ని భయం గొలిపేదానిగా చూస్తారు. వాళ్ళు అలా భావించటం వల్ల ప్రపంచం నిజంగానే భయం గొలిపేదిగా ఉంటుంది.

★ రేయిలో అత్యంత చీకటి అలుముకునే ఘడియ సరిగ్గా ఉషోదయానికి ముందు వస్తుంది.

★ ఈ భూమిపైన ప్రతి వ్యక్తీ ఏమి చేసినా ప్రపంచ చరిత్రలో కీలకమైన పాత్ర పోషిస్తుంటాడు. సాధారణంగా ఈ ఎరుక అతడికి లేదు.

(సుప్రసిద్ధ రచయిత పాలో కోయిలో రాసిన 'ది ఆల్కెమిస్ట్' ఆధారంగా)

జోక్స్ కార్నర్

చెప్పింది

టీచర్ : అదేంటిరా? చెవిలో దూది పెట్టుకున్నావేంది?

విద్యార్థి : మీరు చెప్పింది రెండో చెవి ద్వారా పోకూడదని.

టీచర్ : నేనేం చెప్పానో చెప్పు?

విద్యార్థి : మీరు చెప్పింది మీకే తెలియకపోతే మాకెలా తెలుస్తుంది?

బాగానే

అంకిత : పూజా పరీక్షలు ఎలా రాశావు?

పూజ : పెన్నుతో బాగానే రాశాను.

– రత్నావత్ పంచారామ్, ఊట్‌పల్లి, నిజామాబాద్

టికెట్ దండగ

ఓ తాతగారు హైదరాబాద్ నుండి వైజాగ్ వెళ్లడానికి బస్సు ఎక్కాడు. వైజాగ్ వరకు టికెట్ తీసుకోకుండా ఎక్కిన తర్వాతి స్టేజ్‌కి టికెట్ తీసుకుని దిగి, మళ్లీ ఎక్కడం, మళ్లీ టికెట్ తీసుకోవడం... అలా వైజాగ్ వరకూ అలాగే చేశాడు. తాతగారి తీరుకు విసుగు పుట్టిన కండక్టర్ "ఏంటి తాతగారూ? ఇలా వచ్చిన ప్రతి స్టాప్‌లో దిగి మళ్లీ ఎక్కి టికెట్ తీసుకోకపోతే ఒకేసారి వైజాగ్‌కి టికెట్ తీసుకోవచ్చుగా" అన్నాడు.

దానికి తాతగారు "నేను గుండె జబ్బు మనిషిని బాబూ. నా ప్రాణం ఏ క్షణంలోనైనా పోవచ్చని డాక్టర్ ఐదేళ్ల క్రితమే చెప్పాడు. నేను మధ్యలో ఉండగానే ప్రాణం పోయిందనుకో వైజాగ్ వరకు తీసుకున్న టికెట్ దండగ కదా" అని జవాబిచ్చాడు.

కష్టపడి

టీచర్ : పరీక్ష రాయకుండా ఏడుస్తున్నావేంటి?

విద్యార్థి : నేను కష్టపడి రాసి తెచ్చుకున్న కాపీ స్లిప్పులన్నీ ఎవరో కొట్టేశారు సార్.

పట్టుదల



తండ్రి : పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. నువ్వూ వున్నావు ఎందుకూ ఎప్పుడూ రోడ్లమ్మటి తిరగడం తప్పితే ఇంత వరకూ ఉద్యోగం సంపాదించలేకపోయావ్.

కొడుకు : అలాగే నాన్నా! నీకు నేనో పని చెప్తాను. అది పట్టుదలతో చేసి చూపించు. అప్పుడు నేనూ ఏదో ఒక వుద్యోగం తెచ్చుకుంటాను.

తండ్రి : ఏంటో అది చెప్పు?

కొడుకు : (గ్లాసులో పాలు పారబోసి) ఈ పాలనీ ఎత్తి చూపించు. నేను రేపే ఉద్యోగంలో చేరతాను.

వంశపారంపర్యం

డాక్టర్ : ఈ జబ్బు మీతో మొదలవ్వలేదు. ఇది మీకు వంశపారంపర్యంగా మీ తాతల నుండి వచ్చింది.

రోగి : హమ్మయ్య. బతికించారు. అయితే ఆ వైద్యమేదో మా తాతగారికి చేయండి.

మహా ఆకర్షణ నుమాయిష్

ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అంటే చప్పున గుర్తు రాకపోవచ్చేమో కానీ 'నుమాయిష్' అనో, నాంపల్లి ఎగ్జిబిషన్ అనో చెప్తే మాత్రం వెంటనే 'అయితే అక్కడికి ఒకసారి వెళ్లి రావాలి' అనుకోని నగర వాసులు అరుదు. సిటీలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఎన్ని వున్నా నుమాయిష్ వచ్చిందంటే ఆ 46 రోజులు సందడే. గత 74 సంవత్సరాలుగా ప్రతి ఏడాదీ జనవరి 1 నుండి ఫిబ్రవరి 15 వరకు వుండే ఈ నుమాయిష్‌కు ఏడాదికేడాదికి ఆదరణ పెరుగుతుందే కానీ తగ్గట్లేదు. ఇప్పుడు 75వ వసంతంలోకి అడుగుపెట్టి ప్లాటినం జూబ్లీ జరుపుకుంటోంది. నగర వాసులే కాకుండా చుట్టుపక్కల ఊళ్ళనుండి కూడా ఇక్కడికి వస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది తెలంగాణలో ప్రతి ఏడూ జరిగే అతి పెద్ద వ్యాపార ప్రదర్శన.

దేశం నలుమూలల నుండి అంటే కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఎంతోమంది ఇక్కడికి వచ్చి తమ వ్యాపారం చేసుకుంటారు. వచ్చేటప్పుడు ఎంత హుషారు, ఉత్సాహంతో వస్తారో తిరిగి వెళ్లేటప్పుడు కూడా అంతే ఆనందంతో కొద్దో గొప్పో లాభాలతో వెళ్తుంటారు. ఎక్కువ స్టాళ్లు మాత్రం

1938లో 'నుమాయిష్-ఆ-మస్నూత్-ఇ-ముల్కీ' ప్రారంభోత్సవంలో దృశ్యం

ఉత్తర భారతదేశం అంటే కాశ్మీర్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర వారివే ఉంటాయి. ఈ రాష్ట్రాల వారు ఇక్కడ స్టాళ్లు ఏర్పాటు చేసుకోడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. వారు ఏర్పాటు చేసే స్టాళ్లలో వారి రాష్ట్ర సంప్రదాయ దుస్తులు, వస్తువులు (హాండీక్రాఫ్ట్) ఎక్కువగా ఉంటాయి. వాటికి ఇక్కడ ఎక్కువ ఆదరణ కూడా లభిస్తోంది అంటారు ఆ వ్యాపారులు. అలా వస్తున్న వారిలో 15 – 20 సంవత్సరాల నుండి వరుసగా వస్తున్న వారు కూడా ఉన్నారు.

ఇవే కాకుండా మహిళా సంఘాలు, డ్వాక్రా సంఘాల వారిచే తయారు చేయబడిన వస్తువుల స్టాళ్లు, ఖైదీలు తయారు చేసే దుస్తులు, వస్తువుల స్టాళ్లు కూడా వుంటాయి. కొన్నిసార్లు పాకిస్తాన్‌లో తయారయ్యే ఇరాన్ కార్పెట్లు కూడా ఈ ఎగ్జిబిషన్‌లో కనిపిస్తాయి.

1932వ సంవత్సరంలో ఉస్మానియా యూనివర్శిటీ గ్రాడ్యుయేట్లయిన ఆరుగురు విద్యార్థులకు ఓ ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా ఎకనామిక్ కమిటీని ఫాం చేశారు. వారి ఉద్దేశ్యం ఏంటంటే తాము చేసే పని మరికొంతమందికి ఉపయోగ పడాలనుకున్నారు. అది కూడా అమ్మాయిల చదువుకు, వారి అభివృద్ధికి, మైనారిటీ, రూరల్ ఏరియాల్లో వుండే వారి చదువుకు ఉపయోగపడాలనుకున్నారు. ఎన్నో ఆలోచనలు చేసినా చివరికి వారి ఆలోచనలు కార్యరూపం దాల్చింది మాత్రం 1938లో. ఎంతోమంది దగ్గర నుండి విరాళాలు సేకరించి 'నుమాయిష్–ఆ–మస్నూత్–ఇ–ముల్కీ' పేరుతో 1938 జనవరి 1న ప్రారంభించారు. దీన్ని అప్పటి హైదరాబాద్ స్టేట్ ప్రైమ్ మినిస్టర్ శ్రీ అక్బర్ హైదేరీ ప్రారంభించారు. ఆ సంవత్సరం 40 స్టాళ్లు ఏర్పాటయ్యాయి. మొదటి ఎగ్జిబిషన్ నిర్వహణ సొసైటీ అధ్యక్షుడిగా మహ్మద్ అలీ, కార్యదర్శిగా శంకర్‌జీ ఉన్నారు. మొదటి సారి ప్రదర్శనలో వారు పెట్టిన పెట్టుబడి పోను రూ.2.50 పైసలు లాభం వచ్చింది. ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్లలో ఉత్సాహమూ వచ్చింది. అప్పుడు ఇది కేవలం పది రోజుల ప్రదర్శన మాత్రమే.

పూర్తి భద్రతా ఏర్పాట్లు చేశాం

2014లో 22 లక్షల మంది సందర్శించారు. ఈ సారి సందర్శకుల సంఖ్య 25 లక్షల వరకు వుంటుందనుకుంటున్నాం. ఈ సంవత్సరం 2600 స్టాళ్లు ఏర్పాటయ్యాయి. అందుకు తగ్గ ఏర్పాట్లూ చేశాం. భద్రత కోసం 150 మంది పోలీస్ ట్రైనింగ్ వాలంటీర్లను ఏర్పాటు వున్నారు. వీరు కాకుండా 110 మంది ఇంటర్నల్ సెక్యూరిటీ సిబ్బందిని, వాచ్ అండ్ వార్డ్ కమిటీ కింద మరో 75 మంది ట్రైనింగ్ తీసుకున్న వారిని నియమించాం. వీరు డాగ్ స్వాడ్‌తో రాత్రి పూట కూడా పనిచేస్తారు. ఇవి కాక ఎగ్జిబిషన్‌లో అక్కడక్కడా సీసీ కెమెరాలు వున్నాయి. గత సంవత్సరం ఈ ఎగ్జిబిషన్ మీద 11 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రతి సంవత్సరం వచ్చిన ఆదాయంలో 85 శాతం ఇన్స్టిట్యూషన్లకి అందజేస్తాం. మిగతాది సొసైటీ నిధి కింద ఉంచుతాం. వీటిలో నుండే కాశ్మీర్ వరదలప్పుడు, హుదూద్ వరదలప్పుడు పది లక్షల చొప్పున ముఖ్యమంత్రి గారి ద్వారా అందజేశాం. కోశాధికారిగా అనిల్ స్వరూప్ మిశ్రా వున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని 18 కళాశాలలకి ఈ సహాయం అందుతుంది. వీటిలో నాలుగు కళాశాలలు ఈ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ఉన్నాయి. ఈ సంవత్సరం పాత బస్తీలోని మూడు స్కూళ్ళని దత్తత తీసుకున్నాం. రెండు గౌలిగూడలోని స్కూళ్లు, ఒకటి మొఘల్‌పురాలోది. ఈ మూడు స్కూళ్లకు అవసరాలను బట్టి ఏమేం కావాలో అవి సమకూర్చుతాం. హుజూరాబాద్‌లో స్కూలు, హాస్టలుకు, సిరిసిల్లాలో ఉమెన్స్ కాలేజీ ఏర్పాటుకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆమోదం తెలిపింది. గతంలో చంద్రబాబు నాయుడు గారు ఈ ఎగ్జిబిషన్‌కి ఎంత ఉత్సాహం చూపించేవారో ఇప్పుడు కె.సి.ఆర్ గారు కడా అంతే ఉత్సాహం చూపించడం, ఆయన ఈ ఎగ్జిబిషన్ మైదానాన్ని సొసైటీ యాజమాన్యానికే ఇస్తాననడం ఆనందంగా ఉంది.

– నరోత్తమ్ రెడ్డి, ఎగ్జిబిషన్ సెక్రటరీ

మొదటి ప్రదర్శనలో ఆరుగురు మాత్రమే స్టాళ్ళను ఏర్పాటు చేశారు. వారు 1. షా ఆలమ్ ఖాన్, 2. ఆమోల్ లాహోతి, 3. డా॥ఎ.నరసింహారావు, 4. ధిరన్ రమేష్ చంద్ర, 5. డా॥ షంషాద్ హుస్సేన్, 6. ఎస్.కె. నిజాముద్దీన్ హాసన్. వీరు కాకుండా జస్టిస్ ఎ.సీతారామ్ రెడ్డి, ఎ.రంగారావు, ఎన్.లక్ష్మీ నారాయణగార్లు ఎగ్జిబిషన్ సొసైటీలో మెంబర్లుగా ఉన్నారు.

నేటి పబ్లిక్ గార్డెన్స్‌లో అప్పటి ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పుట్టిన రోజు వేడుకలను జరుపుకునేవారు. ఈ ఎగ్జిబిషన్ గురించి తెలుసుకున్న మీర్ ఉస్మాన్ పబ్లిక్ గార్డెన్స్‌లో నుమాయిష్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. 1940లో స్టాళ్ళ సంఖ్య 100కు పెరిగింది. తర్వాత ఏడాదికేడాదికి స్టాళ్ళ సంఖ్య పెరగడంతో అక్కడి స్థలం సరిపోలేదు. 1946లో నాంపల్లిలో నేడున్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు ఈ నుమాయిష్‌ని మార్చారు.

1947–48 సంవత్సరాలలో నుమాయిష్ వేడుకలు లేవు. రజాకార్ల ఉద్యమం, అప్పటి పరిస్థితుల కారణంగా ఈ మధ్యకాలంలో ఎగ్జిబిషన్‌ని నిర్వహించలేదు. తిరిగి భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నుమాయిష్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. 1949లోఈ 'ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్' ను అప్పటి భారత్ గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి ప్రారంభించారు.

1947–48లో తప్ప ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ఈ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. ఇందులో పాల్గొనే స్టాళ్ళ సంఖ్యతో పాటు సందర్శకుల సంఖ్యా పెరుగుతోంది. కేవలం పది రోజులతో ప్రారంభమైన ఈ ప్రదర్శన తర్వాతి కాలంలో నెల రోజులు, ఆ తర్వాత స్టాళ్లు, సందర్శకుల కోరిక మేరకు ఇప్పుడు 46 రోజులకు పొడిగించారు.

1949లోభారత్ గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి ప్రారంభోత్సవంలోని దృశ్యం

దాదాపు ఇక్కడ లభించని వస్తువంటూ లేదు. గుండు సూది మొదలు భారీ ఎలక్ట్రికల్ పరికరాల వరకు ఇక్కడి ప్రదర్శనలో ఉంటాయి. రూపాయి వస్తువు నుండి లక్ష రూపాయలు ఖరీదు చేసే వస్తువులు లభిస్తాయి. వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాలు, గృహోపకరణ, గృహ అలంకరణ వస్తువులు ఇందులో కనిపిస్తాయి. 23 ఎకరాలున్న ఈ సువిశాల ప్రదేశం ఎగ్జిబిషన్ నడిచే 46 రోజులూ కిక్కిరిసిపోయి ఉంటుంది. వెయ్యి కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది.

నుమాయిష్‌లో కొన్ని ప్రత్యేక రోజులు కూడా ఉన్నాయి. జనవరి 6వ తేదీ మహిళలకు ప్రత్యేకం, వాటర్ కలర్స్ పెయింటింగ్ జనవరి 17, రంగోలీ కలర్స్ జనవరి 18, ఫ్లవర్ అరేంజ్‌మెంట్స్ జనవరి 24, మెహందీ జనవరి 25, జనవరి 31 పిల్లలకు ప్రత్యేకం, ఆర్టిసన్స్ డే ఫిబ్రవరి 1, వెల్ బేబీ షో ఫిబ్రవరి మొదటి వారం, కుకరీ కాంపిటీషన్స్ ఫిబ్రవరి 7... ఇలా కొన్ని ప్రత్యేక సందర్భాల పేరుతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

నుమాయిష్‌కి ప్రవేశ రుసుము మొదటి సంవత్సరం ఒక అణా వుండేది. ఇప్పుడు అదే 20 రూపాయలకు పెరిగింది. ఈ గ్రౌండ్ పక్కనే వెహికిల్స్ పార్కింగ్ స్థలముంది. ద్విచక్ర వాహనాలకు 20/–, కార్లకు 50/– చొప్పున వసూలు చేస్తారు.

పిల్లలు ఆడుకోడానికి జెయింట్ వీల్, టైటానిక్ షిప్.. ఇంకా ఎన్నో రకాల ఆటలు, రకరకాల తినుబండారాలతో, కొత్త కొత్త వస్తువులు, మహిళలకి గృహోపకరణాలు, అలంకార వస్తువులు, డ్రై ఫ్రూట్స్, టాయ్ ట్రైన్... ఇలా ఒకటేంటి? సకుటుంబంగా వెళ్లి ఆనందంగా గడపడానికి అనువుగా అన్ని ఏర్పాట్లూ, ఆహ్లాద వాతావరణమూ నుమాయిష్‌లో ఉన్నాయి. షాపింగ్ మాల్స్‌లో కొంటే ఆ లాభాలు ఆ యజమానికే సొంతం. కానీ ఇక్కడకు వెళ్తే ఎంతో మంది విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థకు ఉపయోగపడుతుంది. అయితే ఒక్కటి మాత్రం మర్చిపోకూడదు... అదే బేరమాడడం. షాపింగ్ మాల్స్‌లోలా ఇక్కడ ఫిక్స్‌డ్ రేట్లు ఉండవు. రేట్లు విపరీతంగా చెప్తారు. ఒక్కోసారి రెండింతలు కూడా అనిపిస్తాయి. అయితే ఆ వస్తువుల నాణ్యత, రేట్లు తెలుసుకుంటే కరెక్ట్ రేటు అడిగి తీసుకోవచ్చు.

– బి.మల్లేశ్వరి

నెమలీక

గుమ్మడి తీగ తెలివి

పూర్వం చెట్లకి, తీగలకి, మహా వృక్షాలకి కాయలు కాసేవి కావు. జనం కూడా వాటిని పట్టించుకునేవారు కాదు. జంతువులు, పక్షులు కూడా నివాసం కోసం, నీడ కోసం ఇంకెందుకూ పనికిరావు అనుకునేవి. అయితే తీగలు, పొదలు, వృక్షాలు ఒక రోజు చిన్న సభ పెట్టుకున్నాయి. మనకి ఏదో ఓ ప్రత్యేకత కావాలి. అలా ఉంటేనే సమాజం గుర్తిస్తుంది కదా అని చెట్ల సమూహం అంతా కలిసి రావి చెట్టుకింద తపస్సు చేసుకుంటున్న మునిని అడిగాయి. అయితే ముని మీరు భగవంతుని కోసం తపస్సు చెయ్యండి. అలా చేసినచో మీ కోరిక ఫలిస్తుంది అన్నాడు ముని.

చెట్లు, పొదలు తీగలు కలిసి భగవంతుని కోసం తపస్సు చేశాయి. భగవంతుడు ప్రత్యక్షమై ఏం కావాలన్నాడు. వెంటనే చెట్లు "మేం జంతువులకు, పక్షులకు, మనుషులకు ఆకలి తీర్చే పండ్లు ఇవ్వండి" అన్నాయి. అలాగే అయితే రకరకాల పండ్లు ఇస్తున్నాయి. మీరు పంచుకోండి. మీకు ఆ పండ్లే కాస్తాయి" అని అదృశ్యమైనాడు దేవుడు.

కాయలు పంచే బాధ్యత తాటి చెట్టుకి అప్పగించాయి అన్ని వృక్షాలు కలిసి. పండ్ల పంపకం మొదలైంది. అన్ని పొదలు, వృక్షాలు, తీగలు రావాలని కబురంపింది తాటి చెట్టు.

చెట్ల సమూహం బయల్దేరి వెళ్తున్నాయి. అయితే ఓ తీగ వెళ్తూ వెళ్తూ మర్రి చెట్టుని రమ్మంది. నేను రానులే, నా కాయలు కూడా నువ్వే తీసుకురా అంది బద్ధకంగా. సరేలే అంటూ పాకుతూ వెళ్లింది తీగ. వృక్షాల సైజును బట్టి మామిడికి మామిడికాయలు, పనస చెట్టుకు పనస కాయలు, ఇంకో చెట్టుకు సపోట... ఇలా ఇలా అన్ని చెట్లకు అన్ని రకాల కాయల్ని పంచింది తాటి చెట్టు. ఆఖర్న తీగ మొక్కకి చిన్న కాయలు ఇచ్చింది. మర్రి చెట్టు పెద్దది కదా అని గుమ్మడి కాయలు ఇచ్చింది.

అయితే తీగ చెట్టు 'కష్టపడి ఇంత దూరం వస్తే నాకు చిన్న కాయలు, రాకుండా ఉన్న మర్రి చెట్టుకు ఇంతింత పెద్ద కాయలా?' అని ఆలోచించి "మర్రి చెట్టూ మర్రి చెట్టూ... నీకు ఈ చిన్న కాయలు ఇచ్చింది తాటి చెట్టు" అంది. "సరేలే" అంటూ చిన్న కాయలనే తీసుకుంది మర్రి చెట్టు.

తీగ మొక్క గుమ్మడి కాయల్ని తీసుకుంది.

అప్పటి నుండి తీగ చెట్టు పెద్ద పెద్ద గుమ్మడి కాయల్ని కాస్తుంది, మహా వృక్షమైన మర్రి చెట్టు చిన్న చిన్న కాయల్ని కాస్తుంది.

కొన్నాళ్లకి అసలు విషయం తెలుసుకున్న మర్రిచెట్టు లబోదిబోమంది. అప్పటన్నుంచి నా బద్ధకం వల్లే ఈ అనర్థం జరిగింది. ఇక నుండి బద్ధకంగా ఉండకూడదు. దాన్ని ఎలాగైనా వదుల్చుకోవాలనుకుంది మర్రిచెట్టు.

– వీధుల రాంబాబు, 9440255275, భద్రాచలం, ఖమ్మం.

ఎవరి గాలిపటం ఏది?

ఐదుగురు చిన్నారులు ఐదు గాలి పటాలు ఎగరేస్తున్నారు. వాటి దారాలన్నీ చిక్కుబడిపోయాయి. ఎవరి గాలిపటం ఏదో చెప్పుకోండి చూద్దాం.



ఆ ఒక్కటి ఏది?

ఇక్కడున్న టోపీల్లో అన్నీ జతగానే ఉన్నయి ఒక్కటి తప్ప. ఆ ఒక్కటి ఏది?



రంగులు వేద్దాం

నీడ ఏది?

ఇక్కడున్న ఆరు నీడల్లో పక్కనున్న అమ్మాయి అసలైన నీడ ఏది చెప్పండి.



ఎమ్. విశ్వేశ్వరయ్య



భారతదేశపు ప్రముఖ ఇంజనీర్లలో తెలుగువారు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఈయన బెంగళూరుకు 40 మైళ్ళ దూరంలోని ముద్దెనహళ్ళి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు శ్రీనివాస శాస్త్రి, వెంకాయమ్మగార్లు. వీరి కుటుంబం మూడు శతాబ్దాల క్రిందటే ఆంధ్రప్రదేశ్‌నుండి అక్కడికి వలస వెళ్లింది. విశ్వేశ్వరయ్య మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఎ, పూణే సైన్స్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగు చదివారు.

బొంబాయి ప్రజా పనుల శాఖలో, భారత నీటి పారుదల కమిషన్‌లో పనిచేశారు. ఈయన దక్కను ప్రాంతంలో చక్కని నీటి పారుదల వ్యవస్థను రూపొందించారు. ఆటోమేటిక్ వరద గేట్లను ఈయనే రూపొందించారు. వాటిని 1903లో పూణె దగ్గరి ఖడక్ వాస్లా దగ్గర ఏర్పాటు చేశారు. తర్వాత వీటినే గ్వాలియర్ దగ్గరి అలతిగ్రాలో, మైసూరు దగ్గరి కృష్ణరాజ సాగర్ దగ్గరి ఆనకట్టలలో కూడా వీటిని ఉపయోగించారు.

హైదరాబాద్ నగరాన్ని వరదల నుండి రక్షించే నీటి పారుదల వ్యవస్థను రూపొందించడంలో ఈయనకు చాలా మంచి పేరు వచ్చింది. విశాఖపట్నంలోని ఓడరేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడంలో కూడా ఈయన పాత్ర వుంది. బెంగళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజీ స్థాపనలో ఈయన ప్రముఖ పాత్ర వహించారు. బ్రిటీష్ ప్రభుత్వం ఈయన్ని 'సర్' బిరుదుతో, భారత ప్రభుత్వం 'భారతరత్న' బిరుదుతో సత్కరించాయి. ఈయన జీవిత కాలం 1861 –1962.

మూడు రెట్లు ఎక్కువ

- కంగారూల్లో నాలుగు రకాలున్నాయి. రెడ్ కంగారూ, ఈస్టర్న్ గ్రే కంగారూ, వెస్టర్న్ గ్రే కంగారూ, యాంటీలోపైన్ కంగారూ.
- కంగారూ వెనకున్న రెండు కాళ్లతో వేగంగా పరిగెత్తగలదూ, నాలుగు కాళ్ళతో చిన్నగా నడవగలదు.
- కంగారూ వెనక్కి నడవలేదు.
- ఇది 6–10 అడుగుల ఎత్తు పెరుగుతంది.
- కంగారూ తన ఎత్తుకి మూడు రెట్లు ఎక్కువ ఎత్తు కూడా ఎగురుతుంది. అంటే ఒక్కోసారి 30 అడుగుల ఎత్తు ఎగురుతుంది.
- ఎగిరేటప్పుడు బ్యాలెన్స్ చేసుకోడానకి తోకని ఉపయోగించుకుంటుంది.
- దీని కాళ్ళు చాలా బలంగా ఉంటాయి.
- ఇది నీళ్ళలో ఈదలేదు.
- దీనికి పొట్ట భాగంలో సంచి వంటి నిర్మాణం ఉంటుంది. ఇందులో పిల్ల కంగారూని పెంచుతుంది.
- ఇది ఎక్కువగా ఆస్ట్రేలియాలోనే కనిపిస్తుంది. మిగతా ప్రాంతాల్లో చాలా తక్కువగా ఉంటాయి.
- కంగారూ శాఖాహారి.
- కంగారూ పుట్టినప్పుడు కేవలం ఒక ఇంచి పొడవు మాత్రమే ఉంటుంది.
- కంగారూ పిల్ల పుట్టిన తర్వాత పది నెలల వరకు తల్లి కంగారూ పొట్టమీద వున్న సంచిలోనే ఉంటుంది.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి, 19)

పారిస్ , వసంత కాలం , 1948

మనం మోకరిల్లుతున్నాం గనుకే ఇతర్లు గొప్పవాళ్లుగా కనిపిస్తున్నారు. లేవండి, నిటారుగా నడుద్దాం. (ఏలిసి లూస్టలూ)

రోజంతా ప్రయాణం చేసి పారిస్ చేరుకున్నారు మార్క్స్ దంపతులు. విపరీతమైన చలిలో జరిగింది ప్రయాణం. ఏడాది ఎడ్గార్‌ను హత్తుకు కూర్చుంది జెన్నీ. ఆడపిల్లలు, మగవాళ్ల కోట్లలో దూరి చలి నుండి కాపాడుకున్నారు. దారిలో రైలు లైన్లను ధ్వంసం చేయడంతో(పారిశ్రామికీకరణకు వ్యతిరేకంగా నిరసనకారులు చేసిన చర్యయిది). ప్రయాణం మరింత ఆలస్యమైంది. అర్థరాత్రి, రైలు బోగీల్లోంచి గుర్రపు బళ్లలోకి తరలించారు ప్రయాణికుల్ని. రైలు సజావుగా నడవగలదన్న చోట తిరిగి బోగీల్లోకి ఎక్కించారు. ప్రయాణంలో ఎన్ని ఇబ్బందులుంటేనేం, తెల్లవారి ఆ వాతావరణం చూసి ఒళ్లు పులకరించింది. ఎంత అద్భుతమైన, ఉత్తేజకరమైన దృశ్యమది! దారంతా రైల్వే స్టేషన్లలో ఎర్ర జెండాలు, ఫ్రెంచి పతాకమూ దర్శనమిచ్చాయి. ప్రభుత్వం కూలిపోయినందుకు ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారనిపించింది. అయితే, పారిస్ చేరేసరికి యుద్ధ భీభత్సం స్పష్టమైంది. రైలింజన్లు, బోగీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. తగల పెట్టారు. పారిస్ చేరటానికి ముందు స్టేషన్ సెయింట్ డెనిస్ నగరం పూర్తిగా దగ్ధమైంది. ఇక పారిస్‌లో ఎక్కడ చూసినా విరిగిన, కాలిన దృశ్యాలే. వీధుల్లో పరచిన రాళ్లు పెకలించి బారికేడ్లు కట్టారు. కాలుతున్న బళ్లను రోడ్ల మీద అడ్డంగా పెట్టారు. ఇళ్ల కప్పుల మీద విరిగిన ఫర్నిచర్ కనిపించింది. తల్లకిందులైన బళ్లు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. రాజ భవనం కిటికీలు బద్దలై కనిపించాయి. ఎదురుగా వున్న గార్డ్ హౌజ్ నల్ల బొగ్గుగా మారింది. లోపలి గార్డుల్ని సజీవ దహనం చేసినట్టే ఉంది.

మూడేళ్ల క్రితం 1845లో తామిక్కడున్నప్పుడు జెన్నీ, మార్క్సులు చూసిన పారిస్ కాదు ఇది. కాని ధ్వంసమైతేనేం ఇప్పుడిది స్వేచ్ఛా నగరం. విముక్త నగరం...కనీసం పురుషులకు. మార్క్స్ దంపతులు అక్కడికి చేరిన రోజే, పురుషులందరికీ ఓటింగ్ హక్కు లభించింది. ఇప్పుడు వాళ్లకు అరెస్టు భయం లేదు. అక్కడి ప్రముఖ వ్యక్తులందరూ స్నేహితులూ, అనయాయులే. మార్క్స్ మిత్రుడు జాక్ ఇంబెర్ట్ ఇప్పుడు గవర్నర్. మరో మిత్రుడు పోలీసు ఉన్నతాధికారి. విడుదలైన రాజకీయ ఖైదీలతో సివిల్ గార్డ్ ఏర్పాటు చేసే పనిలో ఉన్నాడు. ఎంగెల్స్ మాటల్లో ఈ కాలం "రిపబ్లికన్ హనీమూన్". ఎండిపోయిన బ్రెడ్డు, బంగాళా దుంపలు మాత్రమే తిని కడుపు నింపుకుంటున్న నగరం. "తాము నరికేసిన చెట్ల స్థానంలో వీధుల్లో ఇరువైపులా స్వేచ్ఛా వృక్షాలు" నాటుతున్నారు. సాయంత్రాలు వినోదాలతో, పాటలు, నాట్యాలతో గడిచాయి.

పారిస్ చేరిన రోజు , మార్క్స్ దంపతులకు ఉండటానికి గది దొరకలేదు. ఈ సంబరాలు చూడటానికి అందరూ అక్కడికి చేరడంతో లాడ్జింగులన్నీ నిండిపోయాయి. చివరికి జర్మన్ సోషలిస్టులకు వసతి కల్పించే ఒక యింట్లో తల దాచుకున్నారు. గదిలో లగేజి పెట్టారో లేదో మార్క్స్ పాత మిత్రులను, కొత్త తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులనూ కలవటానికి బయల్దేరాడు మార్క్స్. బకూనిన్ కూడా అక్కడే ఉన్నాడు. ఆ ఆనంద సందోహంలో పాలు పంచుకోవాలనే అందరి కోరిక.

1789 నాటి ఫ్రెంచ్ విప్లవ కాలం నుండే పారిస్ యింత ఉద్రిక్తంగా, ఉన్మత్తంగా ఎప్పుడూ లేదు. ఈ వాతావరణాన్ని 'కళాత్మకంగా' అధ్యయనం చెయ్యడానికి రూన్ నుండి వచ్చాడు గుస్తావ్ ఫ్లోబెర్ (ప్రసిద్ధ ఫ్రెంచి నవలా రచయిత 'మదాంబావరీ' రాసిందీయనే), జార్జి సాండ్ (మరో ప్రముఖ రచయిత్రి) గృహ మంత్రిత్వ శాఖ వారి కోసం బులెటిన్లు రాస్తోంది. విక్టర్ హ్యూగోను విద్యా శాఖ మంత్రిగా ఉండమని కోరింది కొత్త ప్రభుత్వం (ఆయన నిరాకరించాడు). ఒక టేబులు, రెండు కుర్చీలుంటే చాలు, అక్కడో "పొలిటికల్ క్లబ్బు" పుట్టు కొచ్చింది. విడాకులు చట్ట బద్ధం చేయాలని మహిళా గ్రూపులు ప్రచారం చేశాయి. మహిళల హక్కుల కోసం పసుపు పచ్చ పోస్టర్లు నగరమంతా వెలిశాయి. ఈ హక్కుల కోసం మహిళా మేధావులు పోరాడారు.

కాని విప్లవంలో పాల్గొన్న పురుషులే వీళ్లను సమర్థించలేదు (ఆనాటి ఫ్రెంచి సోషలిస్టులు మహిళా హక్కుల వ్యతిరేకులన్నది జగద్విదితం). వార్తా పత్రికల సంఖ్య ఎంతగా పెరిగిందంటే, ఒక పారిస్ నుండే 171 పత్రికలు వెలువడ్డాయి మొదటి రోజునే. పత్రిక ప్రారంభించమని ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఒక మిత్రుడు ధన సహాయం ప్రకటించారుగాని మార్క్స్ నిరాకరించాడు. అన్ని ప్రభుత్వాల నుండీ రిపబ్లికన్ ప్రభుత్వం నుండి కూడా దూరంగా ఉండాలనుకున్నాడు. పైగా పారిస్ విప్లవం లాంటిది జర్మనీలో జరగటానికి కృషి చేస్తున్నప్పుడు లీగ్ నాయకులు లండన్ నుండి పారిస్ చేరుకున్నారు. "మేధో చర్చలకు ఇది సమయం కాదు. అందరూ ఉద్యమంలో భాగం కావాల్సిందే" అన్నాడు ఎంగెల్స్.

ఈ 'సామాన్యుని వసంత కాల గర్జన' పారిస్‌కు మాత్రమే పరిమితం కాలేదు సరికదా జర్మన్ సమాఖ్యలోని అనేక నగరాలకూ విస్తరించింది. యూరప్‌లో జరిగినట్టే జర్మనీలోని ముప్ఫైతొమ్మిది ప్రాంతాల్లో వ్యవసాయం బాగా దెబ్బతింది. 1844 నుండీ ఆహార పదార్థాల ధరలు బాగా పెరిగాయి. ఇంచు మించు అన్ని రాష్ట్రాల్లో ఆకలి దాడులు జరుగుతున్నాయి. అప్పటికి జర్మనీ యింకా వ్యవసాయిక దేశమే. కాని వచ్చిన కొద్ది పరిశ్రమలు కూడా వృత్తి కార్మికులకు శాపంగా పరిణమించాయి. ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వీళ్లెవరూ ఇష్టపడలేదు.

సమాఖ్యలోని అతి పెద్ద రాష్ట్రం– అత్యంత జనాభా కలిగిన రాష్ట్రం– ప్రష్యాలో సమస్యలు కూడా అత్యంత తీవ్రంగా ఉన్నాయి. అయినా పారిస్ పరిస్థితులు ఇక్కడ పునరావృతం కావటానికి కనీసం ఓ ఏడాదైనా పడుతుంది. అది కూడా ఆస్ట్రియాకు చెందిన ప్రిన్స్ మెట్టర్‌నీష్ పతనం తర్వాత.

యూరోపియన్ ప్రభుత్వాల రియాక్షనరీ స్వభావానికి ప్రతీక మెట్టర్ నీష్. ప్రష్యా, ఆస్ట్రియా, రష్యాల రియాక్షనరీ సమాఖ్య ఏర్పడటానికి ఈయనే కారణం. ఈయన కేవలం ఆస్ట్రియన్ ఛాన్సలర్ మాత్రమే అయినా సమాఖ్యకు ప్రాతినిధ్యం వహించినట్టుగా ప్రవర్తించాడు.

ఫ్రెంచ్ విప్లవం తర్వాత, ఆస్ట్రియాలో కూడా ఏదో జరగక తప్పదనే అనుకున్నారందరూ. అంతకు ముందరే, తమకు తాము వుదారవాదులమే కాని రాడికల్స్ కాదని చెప్పుకున్న వైద్య విద్యార్థులు కొందరు, పత్రికా స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, రాజ్యాంగం వగైరా కావాలని రాజుగారు ఫెర్డినాండ్‌కు అర్జీ పెట్టుకున్నాడు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను తిరస్కరించడంతో వేలాది మంది ప్రదర్శనగా పార్లమెంట్‌కు బయల్దేరారు. సైన్యం అడ్డుకుని కాల్పులు జరపడంతో పదిహేను మంది మరణించారు. ఆ తర్వాత. నేషనల్ గార్డ్ కూడా ప్రతిపక్షాలతో చేయి కలిపింది.

మెట్టర్‌నీష్ రాజీనామా చేసి మారు వేషంలో ఇంగ్లండుకు పారిపోయాడు. ప్రదర్శన కారులు వియన్నా (ఆస్ట్రియా రాజధాని)ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆస్ట్రియా సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాలు బుడాపెస్ట్, ప్రాగ్, వెనిస్ స్వాతంత్ర్యం

ప్రకటించుకున్నాయి. ఇటలీలోని మిలాన్‌లో ఆస్ట్రియాకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది.

మార్చి16 నాటికి వియన్నా తిరుగుబాటు వార్తలు బెర్లిన్‌కు చేరాయి. పారిస్ వార్తలతో అప్పటికే అక్కడ అల్లర్లు చెలరేగాయి. నిరుద్యోగ సమస్య, దుర్భర దారిద్ర్యంతో ప్రజల కోపం కట్టలు తెంచుకుంది. లూటీలకు తెగబడ్డారు. వియన్నా ప్రేరణతో ఈసారి తిరుగుబాటు మరింత పకడ్బందీగా జరిగింది. సంస్కరణలకు అంగీకరించాడు ప్రష్యన్ రాజు.

మొదట సెన్సార్ షిప్ రద్దయింది. మంత్రి వర్గం రాజీనామా చేసింది. పార్లమెంట్‌ను సమావేశ పరిచారు. అందరూ కలిసి సమైక్య జర్మనీ కోసం కృషి చెయ్యాలన్నారు. బాల్కనీలో దర్శనమిచ్చిన రాజుగారికి కృతజ్ఞతలు చెప్పారు ప్రజలు. కాని అప్పటికే అక్కడ గుర్రాల మీద సైనికులు ప్రాంగణంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అరుపులు, కేకలతో గోలగోలగా ఉంది వాతావరణం. అంతలో తుపాకులు గర్జించాయి. రాజు గారే సైన్యాన్ని వుసికొల్పాడనుకున్నారు జనం. “ద్రోహం చేశాడు” అన్న నినాదాలు మిన్నంటాయి. “ఆయుధాలు చేపట్టండి!” అంటూ అరిచారు.

వీధుల్లోని రాతి బండలు బారికేడ్లుగా మారాయి. చిన్నా, పెద్దా లేకుండా అందరూ చేతికి దొరికింది దొరికినట్టు తీసుకొని యుద్ధానికి కదిలారు.

తెల్లవారాక కాల్పులు ఆపమని సైన్యానికి ఆదేశాలిచ్చాడు రాజు. ప్రజలతో యుద్ధమంటే పదవికే ముప్పు. సోమవారం మధ్యాహ్నం వరకు వుద్రేకాలు తగ్గి శాంతి నెలకొంది.

రాజ్యాంగబద్ధ పాలన సాగిస్తానన్నాడు రాజు. అంటే రాజరికం అంతమైంది. ఇప్పుడు ప్రష్యన్లు పాలితులు కారు, పౌరులు.

బెర్లిన్ సమాచారం తెలిసిన పారిస్‌లోని జర్మన్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు స్వదేశానికి తిరిగి వెళ్లడానికి సన్నాహాలు చేసుకున్నారు. హెర్వీగ్ ఒక జర్మన్ దళంతో దక్షణ జర్మనీలోకి జైత్రయాత్ర చేయాలనుకున్నాడు. వేలాది మంది వాలంటీర్లు ఆతృతగా నిరీక్షించారు. ఫ్రెంచ్ ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా చేసింది.

కాని ఫ్రాన్స్ చేస్తున్న ఈ సాయం వెనుక జర్మన్లను వదిలించుకోవాలన్న ప్రభుత్వ కుట్ర దాగి ఉందనుకున్నాడు మార్క్స్. ఫ్రాన్స్‌లో ఉద్యోగాల కొరత ఉంది.

హెర్వీగ్ జైత్ర యాత్రను మార్క్స్, ఎంగెల్స్ తీవ్రంగా వ్యతిరేకించారు అక్కడ. యుద్ధం జరిగితే వీళ్లు పరాజితులు కావడం తథ్యం. పైగా ఇంత మంది జర్మనులు రావడం వెనుక ఫ్రెంచి హస్తముందనుకొని జర్మను సంప్రదాయవాదులు ఏకమయ్యే ప్రమాదముంది. ఈ విషయాన్నే ఒక సమావేశంలో మార్క్స్ చెప్పినప్పుడు అందరూ ఆయన మాటలకడ్డుపడి అవమానించినంత పని చేశారు. కొందరు కమ్యూనిస్ట్ లీగ్ సభ్యులు కూడా వాళ్లతో జతగలిశారు (ఈలోగా ఒక పత్రిక సంపాదకుడు ఫోకాన్, పోలాండ్‌లో కూడా తిరుగుబాటు జెండా ఎగరెయ్యాలని, బకూనిన్‌కు 2000 ఫ్రాంకులు, రెండు పాస్ పోర్టులూ ఇచ్చి అక్కడికి పంపాడు). తనను వ్యతిరేకించిన వాళ్లను లీగ్ నుండి బహిష్కరించాడు మార్క్స్. ఆ తర్వాత మరో సంస్థ, జర్మన్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేశాక అందరూ ‘ఎర్ర రిబ్బన్’ కట్టుకోవాలని కూడా సూచించారు. ‘మామూలు ఎరుపు కాదు. నెత్తుటి ఎరుపు’ కావాలన్నాడు షాపర్.

ఇక, తాను స్వయంగా జర్మనీలోకి ప్రవేశించటానికి సన్నాహాలు చేసుకున్నాడు మార్క్స్. అయితే, మార్క్స్ అనుయాయులు హెర్వీగ్ లీజిన్ సైనికుల్లా కాక, ప్రచారకులుగా జర్మనీలోకి ప్రవేశిస్తారు. మూకుమ్మడిగా అందరూ ఒకేసారి దండెత్తరు. ఒక్కొక్క గ్రూపులో కొద్ది మంది మాత్రమే ఉంటారు. జర్మన్ సమాఖ్యలో కమ్యూనిస్టు బీజాలు నాటడమే వాళ్ల లక్ష్యం.

నిజానికి ప్రచార కార్యక్రమం అప్పటికే ప్రారంభమైందనవచ్చు. మార్చి 17నాడు జర్మనీలో ఉన్న వైడిమీయర్‌కు జెన్నీ రాసిన లేఖలో మార్క్స్ జర్మన్ వర్కర్స్ యూనియన్‌కూ, హెర్వీగ్ సైన్యానికీ ఉన్న తేడాల గురించి స్థానిక పత్రికల్లో స్పష్టత ఇవ్వాలని కోరింది. అసలు జర్మనీ చేరకుండానే హెర్వీగ్ దళంలో బీటలు రావటం ఖాయమన్నాడు ఎంగెల్స్.

ఏప్రిల్ 1నాడు ఖడ్గాలు, తుపాకులు ధరించిన వెయ్యి మంది తిరుగుబాటు దారులతో హెర్వీగ్ దళం జర్మనీలోకి ప్రవేశించింది. ఫ్రెంచి సరిహద్దులో అందరూ ఘనంగా వీడ్కోలు చెప్పారు. ఇరవై అయిదు రోజుల తర్వాత, ఈ సైనికులంతా తొలి యుద్ధంలోనే తుడిచి పెట్టుకుపోయారు.

పారిస్‌లో సుమారు ఎనభైవేల మంది జర్మన్ శరణార్థులుంటున్నారు. ఫ్రెంచి ప్రభుత్వ సహాయసహకారాలతో, మార్క్స్ యూనియన్ సభ్యులు నాలుగు వందల మంది ఏప్రిల్ ప్రారంభంలో పారిస్‌ను వదిలి స్వదేశానికి పయనమయ్యారు. ఎంగెల్స్, తొలత తను సైన్యంలో పని చేసిన వప్పెర్‌టాల్‌కు, విల్హెల్మ్‌వూల్ఫ్ బ్రెస్లాకు, షాపర్ వైస్ బాడెన్‌కు, మార్క్స్ కొలోన్‌కు వెళ్లాలి.

స్వదేశంలో వాళ్లనెవరూ అడ్డుకోలేదు. అందరి దగ్గరా ‘కమ్యూనిస్ట్ మేనిఫెస్టో’ మార్క్స్, ఎంగెల్స్ రాసిన “జర్మన్ కమ్యూనిస్ట్ పార్టీ డిమాండ్లు” కరపత్రాలున్నాయి.

మార్క్స్, జెన్నీ, ముగ్గురు పిల్లలు లెంచెన్, ఎంగెల్స్ ఏప్రిల్ ఆరున పారిస్ నుండి బయల్దేరారు.

కొలోన్, 1848

ఐదేళ్ల తర్వాత తిరిగి వచ్చిన మార్క్స్ దంపతులకు కొలోన్ పెద్దగా మారలేదనిపించింది. వ్యాపారస్తులు, ప్రభుత్వం పట్ల అసంతృప్తిగానే ఉన్నారు. కార్మికులు ఇంకా దోపిడీకి గురవుతున్నామనే అనుకుంటున్నారు. మార్పులేమైనా వచ్చాయంటే, అవి కేవలం గత నెలలోనే. సెన్సార్ షిప్ తొలగించారు. ఆంక్షలు లేకుండా రచయితలు ఇప్పుడేమైనా రాసుకోవచ్చు. మార్క్స్ పాత మిత్రులు మోజెస్ హెస్, జార్జి వీర్త్, హైన్రిష్ బర్గర్స్, ఆ నాటి పత్రికకు కొనసాగింపుగా ‘న్యూ రైనిష్ జైటుంగ్’ ప్రారంభించాలనుకుంటున్నారు. వార్తా పత్రిక అంటే మార్క్స్‌కు చేతిలో ఆయుధం. ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసి ఆనందించాడు. తనిక్కడికి చేరడానికి నెలరోజుల ముందే , కొలోన్‌లో కమ్యూనిస్టు సంస్థకు బీజం పడింది.

మార్చ్ మూడున ఒక పేదవాళ్ల డాక్టర్ ఆంద్రియాస్‌గాట్‌బాక్ మరో ఇద్దరు మాజీ ప్రష్యన్ సైనికాధికారులతో కలసి ఒక కమ్యూనిస్టు తిరుగుబాటుకు ప్రయత్నించాడు. అయిదు వేల మంది ఇందులో పాల్గొన్నారు. అప్పటికైతే అందర్నీ అరెస్టు చేశారుగాని, సంస్థ అప్పటికే ప్రజలతో సంబంధాలు పెంచుకుంది. జైలు నుండి విడుదలైన వెంటనే కొందరు కార్యకర్తలు, కొలోన్‌లో ఒక కార్మిక వర్గ గ్రూపు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నాటికి సభ్యుల సంఖ్య ఎనిమిది వేలకు పెరిగింది. కాని, వ్యూహాత్మక విషయాల గురించి గాట్‌బాక్‌తో తీవ్రంగా విభేదించాడు మార్క్స్. ఉద్వేగ భరితమైన, తీవ్ర పదజాలంతో కార్మికుల హక్కుల గురించి, ఏర్పాటు కాబోయే ‘ప్రజా సైన్యం’ గురించి అందర్నీ భయభీయులను చేసేలా ఉపన్యసించడం ఆయన కిష్టం. ఈ రకమైన ‘కమ్యూనిస్టు భవిష్యత్ చిత్రపటం’ చూసి మధ్య తరగతి వాళ్లు గజగజా వణికిపోయారు. ఇటీవలే అతి కష్టం మీద రాజరిక పతనంతో గెల్చుకున్న హక్కుల్ని ఇక అధిక సంఖ్యాకులైన కార్మికులు హరిస్తారని భయపడ్డారు. మార్పు జరుగుతున్న క్రమం చాలా నెమ్మదిగా వున్న మాట నిజమే కాని చరిత్ర పరిణామం ఇలాగే ఉంటుంది. కార్మిక నియంతృత్వానికి ముందు మధ్య తరగతి పాలన రాక తప్పదని మార్క్స్ అవగాహన. అంతేకాక, అప్పటికి కార్మిక వర్గం(జర్మనీలో) బలంగా లేదు. కాయకష్టం చేసే వాళ్ల సంఖ్య తక్కువుందని కాదు. కానీ వాళ్లింకా సంఘటితం కాలేదు. తమ శక్తిని గుర్తించగలిగిన చైతన్యం వాళ్లలో రాలేదు. ఈ లక్ష్యం సాధించాలంటే “మధ్య తరగతి ప్రజాస్వామ్యం” అవసరమని నమ్మాడు మార్క్స్. ఇవి దృష్టిలో పెట్టుకుని, రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామిక అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నాడు. రియాక్షనరీలు విజయం సాధిస్తే, ఇప్పటికి జరిగిన సంస్కరణలన్నీ ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుంది. అందువల్ల తన మిత్రులు ప్రారంభించబోయే వార పత్రిక ప్రజాస్వామిక లక్ష్యాల కోసం(కమ్యూనిస్టు లక్ష్యాల కోసం కాదు)మాత్రమే పనిచేయాలి. అప్పటికి, జర్మనీలో ప్రజాస్వామ్య భావజాలానికున్న ప్రాచుర్యం, కమ్యూనిస్టు భావజాలానికి లేదు. ఒక వేళ మిత్రులు వాళ్లకు నచ్చిన నిర్ణయాలే తీసుకోవాలనుకుంటే “అతి కొద్ది మందికి కమ్యూనిజం బోధించాలి. అందుకోసం కర పత్రం చాలు. కాని కార్యోన్ముఖమైన గొప్ప పార్టీ నిర్మాణం మాత్రం సాధ్యం కాదు” అన్నాడు ఎంగెల్స్.

మార్క్స్ పాత మిత్రులు అతడు మెత్తబడ్డాడన్నారు. కాని ప్రభుత్వం దృష్టిలో అతడు ‘ప్రమాదకరమైన రాడికల్’. మార్క్స్ ముందున్న అసలు సమస్య మరొకటి. తను మెత్తబడినా, పడకపోయినా, పౌరసత్వాలు లేనంతకాలం ‘బహిష్కరణ’ ఖడ్గం తన మీద వేలాడుతూనే ఉంటుంది. ఈ విషయం తేలిందాకా తాను ట్రేయర్‌లోనే ఉంటానన్నది జెన్నీ. కాని పరిష్కారం కనుచూపు మేరలో కనిపించక పోవడంతో జూన్‌లో, పిల్లల్తో కొలోన్‌కు బయల్దేరింది.

(సశేషం)

■ నివాళి

జననం : జూన్ 15, 1974,
మరణం : డిసెంబర్ 15, 2014

తీగ తెగిన వీణ

కొంతమంది వ్యక్తులను 'ఇకలేరు' అనే పదబంధం మధ్యన చూడాలంటే మనసు ఒక పట్టాన అంగీకరించదు. వారితో మనకు ప్రత్యక్ష అనుభవమేమీ వుండకపోవచ్చు. ఎప్పుడూ కలిసి కానీ, మాట్లాడి కానీ వుండకపోవచ్చు. అయినా వాళ్ళు ఇక లేరు అని మనసు అంత త్వరగా గుర్తించదు.

పరోక్షంగా వాళ్ళు నిరంతరం మనతో ఒక సంభాషణ కొనసాగించడమే అందుకు కారణం. ఆ సంభాషణ అంతా మన అంతరంగిక చేతనలో నిండిపోయి మనలని హంట్ చేస్తూ వుండడమే అందుకు కారణం.

చిన్న వయసులోనే చిరస్మరణీయుడైన 'చక్రి' అలాంటి అరుదైన వ్యక్తులలో ఒకడు. తన సంగీతంతో, వ్యక్తిత్వంతో మన మనసంతా నిండినవాడు. జగమంత కుటుంబాన్ని ఏర్పరచుకుని ఏకాకిగా వెళ్లిపోయినవాడు. 'సత్తే ఏ గొడవా లేదు' అంటూ అల్లరి చిల్లరిగా పాటలల్లి నిజంగానే ఏ గొడవా లేకుండా పోయినవాడు.

'చక్రి'ని నేను మొదటిసారి ఎక్కడ చూశానో అంత బాగా గుర్తులేదు. బహుశా... మహబూబాబాద్‌లో ఏ శ్రీరామనవమి పందిరిలోనో దేశభక్తి గీతాలాపన చేస్తూ వుంటే చూసి వుంటాను. లేదా వరంగల్‌లో ఏ ఆరెస్సెస్ సమావేశంలోనో హైందవగీతం ఆలపిస్తుంటే పంకించి వుంటాను.

అతడితో నా పరిచయం అంత వరకే...! కానీ అతడు నా లోలోపల అంతా నిండిపోవడానికి కారణం మాత్రం ఖచ్చితంగా అతడి సంగీతమే!

సంగీతం విశ్వమానవ భాష కదా! అది మా ఇద్దరినీ కలిపి వుంటుంది.

అతడి సంగీతం చక్రవర్తనం కాదు. ఎక్కడో విన్నట్లు, ఎక్కడో చూసినట్లు అనిపించే 'డెజావూ' కూడా కాదు. దానికి అదే స్వయం జ్వలితం. అచ్చు అతడి జీవితం లాగే. ప్రేమ, టీజింగ్, ఫిలాసఫీ ఏ భావం అయినా చక్రి సంగీతంలో కొత్త సంగతులు నేర్చుకోవలసిందే. ఫాస్ట్‌బీట్‌కి ప్రేక్షకలోకం ఊగిపోతున్న కాలంలో మెలోడీకి పట్టం కట్టి ఊగే జనం మొత్తాన్ని తనవైపు తిప్పుకుని.. అల్లనల్లగా మెల్లమెల్లగా ప్రవహించే గోదావరి నదీ సోయగాన్ని వీనుల విందుగా వినిపించి, ఆత్మకి సంతృప్తి చేకూర్చినవాడు చక్రి. 'నువ్వక్కడుంటే నేనిక్కడుంటే ప్రాణం విలవిల' అనేది కవి మాటే కావచ్చు కానీ, చక్రి ఇక్కడ లేడంటే మాత్రం సంగీత ప్రియుల ప్రాణం విలవిల.

జూన్ 15, 1974న వరంగల్ జిల్లా కంబాలపల్లిలో జన్మించిన జిల్లా చక్రధర్ ఎలియాస్ చల్లగాలి, ఎలియాస్ చక్రి జీవితం వడ్డించిన విస్తరేమీ కాదు. ఎన్నో కష్టాలనూ, నష్టాలను ఎదుర్కొంటూ, సంకల్పాన్ని సిద్ధించుకున్న సెల్ఫ్ మేడ్ మ్యాన్ చక్రి. తండ్రి వెంకట నారాయణ స్వయంగా బుర్రకథ కళాకారుడు కావడం, ఇంట్లో సంగీత వాతావరణం నిండుగా వుండడంతో చక్రి సంగీతాభినివేశానికి తొలి పాఠశాల ఇల్లే అయింది.

జీవితం కంబాలపల్లిని విడిచి పెట్టిన తర్వాత పక్కనే వున్న మహబూబాబాద్ టౌన్‌కి చేరుకునేసరికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోకి ప్రవేశించింది. హిందూధర్మం, సంస్కృతం పట్ల ప్రేమనీ, క్రమశిక్షణనీ ఆర్ఎస్ఎస్ నేర్పింది. చదువు, సేవా కార్యక్రమాలు, వేణువు, వాయులీనం అభ్యాసనం సమాంతరంగా కొనసాగాయి.

హన్మకొండలో ఇంటర్ చదువుతూనే స్వయంగా ఆర్కెస్ట్రా సమకూర్చుకుని ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టాడు. ఏనాటికయినా సంగీత దర్శకుడు కావాలన్నదే అతడి ఆశయం.

హైదరాబాద్ వేల చేతులతో 'రా రమ్మని, రారా రమ్మని' ఆహ్వానిస్తే హైదరాబాద్ వచ్చి, ఆ నగర మోహంలో పడిపోయాడు. చల్లగాలి పేరుతో స్వయంగా పాటలు రాసి 'పండు వెన్నెల' అనే ఆల్బమ్ తయారు చేస్తే.. అది కాస్తా డిజాస్టర్ అయింది. ఆ అప్పులు తీర్చడానికి ఒక ప్రయివేట్ హాస్పటల్‌లో కాంపౌండర్‌గా చేరాడు.

చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'చిరుగాలి' పేరుతో చేసిన ఆల్బమ్ చక్రి వైపు సినిమా పరిశ్రమ దృష్టి పడేలా చేసింది. చిరంజీవి సైతం స్వయంగా 'ఇద్దరు మిత్రులు' సినిమాకు అవకాశం ఇచ్చాడు. అయితే అది సంగీత దర్శకుడిగా కాదు, పాటల రచయితగా.

స్వరం లోలోపల కల్లోల పరుస్తుంటే అక్షరం రూపంలో వచ్చిన అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించాడు. చివరకు ఎదురు చూసిన అవకాశం 'లిటిల్ హార్ట్స్' రూపంలో రానే వచ్చింది. ఆ సినిమాకు ఎంతో కష్టపడి, ఇష్టపడి సంగీతం చేసినా అది విడుదలకి నోచుకోలేదు.

సరిగ్గా ఆ సమయంలోనే 'బద్రి' విజయంలో మంచి ఫాంలో ఉన్న పూరీ జగన్నాథ్ 'బాచి' సినిమాతో చక్రికి అవకాశం యిచ్చాడు. 'ఉదిత్ నారాయణ్, హరిహరన్' లాంటి గాయకులు మనసులో మెదులుతూ వున్నా, దర్శకుడి కోరిక మేరకు కుంచె రఘుతో పాటలు పాడించాడు. సినిమా అపజయం

పాలైనా చక్రికి మంచి పేరొచ్చింది.

పూరి రెండవసారి ఇచ్చిన అవకాశం 'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం'తో చక్రి ఇంటింటా స్వరరాగ గంగా ప్రవాహమయి శ్రోతల అంతరంగిక ప్రపంచాలను తన సంగీత, గాత్ర మాధుర్యంతో స్వచ్ఛ, శుభ్ర స్ఫటికంలాగా మార్చడం మొదలు పెట్టాడు.

తరువాత దాదాపు పదేళ్ళు చక్రి అనే సునామీ తెలుగు చలన చిత్ర సీమను చుట్టేసింది.

– చక్రి, పూరీ జగన్నాథ్, రవితేజ ఒక హిట్ కాంబినేషన్

– చక్రి, వంశీ ఒక హిట్ కాంబినేషన్

– చక్రి, బోయపాటి శ్రీను, బాలయ్యబాబు ఒక హిట్ కాంబినేషన్. ఇలా దర్శకుడు ఎవరయినా, చక్రి ముద్ర వుండాల్సిందే.

'మళ్లీ కూయవే గువ్వా... మోగిన అందెల మువ్వా...',

'ఈ రోజే తెలిసింది నీలో దాగిన ప్రేమ',

'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే మేరే హాయ్',

'నీవే నీవే నీవే నేనంటా',

'వెన్నెల్లో హాయ్ హాయ్',

'రా రమ్మని... రారా రమ్మని',

'బంగారు కొండా.. మరుమల్లె దండా'... ఇలా ఎన్ని పాటలని ఉదాహరించగలం? ప్రతి పాటా ఒక రసగుళిక. ప్రతి పాటా ఒక ఇక్షు ఖండం.

కెరీర్ మొత్తమ్మీద ఒక కన్నడ సినిమాతో కలుపుకుని 95 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించిన చక్రి, 'సత్యం' సినిమాలో పాడిన 'ఓ మగువా నీతో స్నేహం కోసం' అనే పాటకి బెస్ట్ సింగర్‌గా ఫిలిమ్ ఫేర్ అవార్డు అందుకున్నాడు. 'సింహా' సినిమాకి ఉత్తమ సంగీత దర్శకుడిగా నంది పురస్కారం పొందాడు.

000

ఒక కీర్తి శిఖరం చేరిన తర్వాత ఏ మనిషయినా ఏం చేస్తాడు? ఆ శిఖరం మీద ఎల్లకాలం వుండిపోవాలనుకుంటాడు. అందుకోసం ఏఏ పనులు చేయకూడదో అన్నీ చేస్తాడు. తన నీడను చూసి తానే భయపడే స్థితికి వస్తాడు. కీర్తి శిఖరం మీద నుండి జారిపోతామేమో అనే భయంతో అభద్రతా భావంలోకి వెళ్లిపోతాడు.

కీర్తి శిఖరం మీద ఎవరయినా ఎంతకాలం వుంటారు? మరొకరికి చోటు కల్పించవలసిందే కదా!

ఈ సత్యం తెల్సిన వాళ్లు శిఖర ప్రాంతమయిన కీర్తిని ఆనందిస్తూనే ఇతర రంగాలలోకి తమను తాము విస్తరించుకుని, తమ ఉనికికి సార్థకత చేకూర్చుకుంటారు. మనీ మేకింగ్‌లో మునిగిపోయి జీవలక్షణం కోల్పోకుండా తమను తాము మనుషులుగా నిలుపుకుంటారు.

సరిగ్గా చక్రి కూడా అదే చేశాడు. 'చక్రి చారిటబుల్ ట్రస్ట్' ను ఏర్పాటు చేసి సొంతవూరు కంబాలపల్లికి సేవ చేశాడు. విద్యార్థులకు యూనిఫారాలు, ప్రోత్సాహ బహుమతులు, సాంఘిక సేవా కార్యక్రమాలు యిలా ఎన్నో చేశాడు.

ఒక రోజున అనుకోకుండా చక్రికి ఒక ఫోన్ వచ్చింది. అవతల ఎవరో అపరిచిత వ్యక్తి. 'మా పాపకి హార్ట్ ప్రాబ్లం అండీ! ఆపరేషన్‌కి డబ్బులు సరిపోవడం లేదు. మీరు సహాయం చేస్తారని..."

ఈ మాటలు విని ఎవరయినా నవ్వి ఫోన్ పెట్టేస్తారు. లేదా ఫోన్‌లోనే విసుక్కుంటారు. కానీ చక్రి అలా చేయలేదు. ఒక మనిషికి డబ్బు ఇచ్చి 'పాప ఆపరేషన్ అయిపోయాక క్షేమ సమాచారాలు తెలియజేయండి' అని చెప్పి మరీ పంపించాడు.

హృదయంలో అమృత తుల్యమైన ప్రేమ లేకపోతే ఎవరు ఇలా చేస్తారు? 'జగమంత కుటుంబం' నాది అనే విశ్వమానవ భావన హృదయంలో వుంది కనుకనే చక్రి అంతిమ యాత్ర జన సముద్రమయింది.

చక్రి కంటే ముందు గొప్ప సంగీత దర్శకులు వున్నారు. చక్రికి సమకాలీనంగా గొప్ప సంగీత దర్శకులు వున్నారు. చక్రి తర్వాత వున్నారు.

కానీ చక్రిలాగా హృదయ వీణాతంత్రులను మీటగలిగిన వాడు చక్రి ఒక్కడే!

అందుకే చక్రి ఇక లేడు అంటే.. 'తీగ తెగిన వీణ' అని అనాలనిపిస్తుంది.

– వంశీకృష్ణ, 9573427422

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక
ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

■ అనువాద కథ

విషం

అదొక వింత కల. మూడో అంతస్తులో వున్న మా వాటా యిల్లు పెళపెళమంటూ కుప్ప కూలింది. అంతలోనే పైకిలేచి యథా పూర్వ రూపం ధరించింది. అంతేకాదు. రైలుపెట్టె మాదిరి కదలసాగింది. బాంబుల వర్షం కురిసింది. ఆకాశమంతా ధగధగ లాడింది. నన్ను మంచానికి గట్టిగా కట్టేశారు. శక్తి కొద్దీ ఎదిరించి పోట్లాడుతున్నాను. అయిదారుగురు నా భార్యపైన దౌర్జనం జరుపుతున్నారు. నేను విపరీతంగా రొప్పుతున్నాను. అరవాలని ప్రయత్నించాను. కానీ మాట పెగిలి రావడం లేదు...

మెలకువ వచ్చి కళ్లు విప్పిచూస్తే నేను రైల్లో ప్రయాణిస్తున్నానని గ్రహించాను. చుట్టూ పరిశీలించాను. ఎదురుగా వున్న బెర్తుమీద నా మిత్రుడు మంచి నిద్రలో వున్నాడు. గడియారం రెండు గంటలు చూపుతోంది. ఇక నిద్రరావడం లేదు. కళ్లు మూసుకుంటే కలలోని ఘట్టం కనిపిస్తోంది. రౌడీలు నా భార్యపైన దౌర్జన్యం చేయడం నన్ను చాలా కలవర పరిచింది. నిస్సహాయస్థితి ఎదురైతే ఎవరైనా ఏం చేయగలరు? మగవాడి పశుత్వానికి ఆడది బలికావడం నిజంగా ఘోరం.

ఇంత ప్రయాణం చేసినా కంటికి విందు చేసే ముఖం ఒక్కటీ కనిపించలేదు. ఎదురైన ముఖాల్లో కళాకాంతీ లేదు. ఎదుదైన ముఖాలు కళాకాంతీ లేవు. ఈసురుమంటూ వుంటాయి. నా మిత్రుడు ఢిల్లీ గురించి గొప్పగా చెబుతాడు. అక్కడ ముఖాలు కళకళలాడుతుంటా యంటాడు.

ఇక్కడ అలాకాదు. కటిక పేదరికం తాండవిస్తుంటుంది. ఇక ముఖాల్లో సంతోషం ఎలా చోటు చేసుకుంటుంది? ఎక్కడ చూసినా ముష్టి వాళ్ళే. రైలు పెట్టెలో నల్లగా, పొట్టిగా వున్న ఒక యువకుడు ముడుచుకుని పడుకున్నాడు. చింపిరి బట్టలతో ఒక యువతి నిద్రలో మునిగివుంది.

అతి కష్టం మీద కంటికి కునుకు పట్టింది. నిద్ర లేచేటప్పటికి తెల్లవారింది. నా మిత్రుడు అప్పటికే లేచాడు. పక్క చుట్టి కట్టేసి కిందికి దిగి బల్లమీద కూర్చున్నాడు. బల్లమీద చివరన ఒక అమ్మాయి నిద్రపోతుంది.

గుంతకల్లు ఎంత దూరంముంది? నా మిత్రున్ని అడిగాను. వెంటనే గుర్తుకొచ్చింది. నాకు మల్లే అతను కూడా ఈ ప్రాంతానికి కొత్తవాడని. గుంతకల్లయితే మేం మరో పెట్టె ఎక్కాలి. మేం వున్న పెట్టె హుబ్లీ వెళ్తుంది. మేం వెళ్ళవలసింది బెంగుళూరికి.

ఇక్కడ ప్రకృతి దృశ్యాలు అంతగా ఆకర్షించవు. పచ్చటిచేలు, వట్టి బీళ్ళు చెట్టా పట్టా లేసుకుని వుంటాయి. అక్కడక్కడా రాతి దిబ్బలు కనిపిస్తాయి. మట్టితో గోడలున్న పాకలే ఎక్కువ. వెళ్ళి అక్కడి ప్రజల మధ్య నివసించాలనిపిస్తుంది.

నా మిత్రుడు ఆడపిల్లల గురించిన ప్రస్తావన తీసుకొచ్చాడు. చిన్నప్పుడు తాను చేసిన చిలిపి పనులు చెప్పాడు. యువకుడుగా నెరపిన ప్రేమ వుదంతాలు ఏకరువు పెట్టాడు. ఎలాంటి స్త్రీనైనా సరే లొంగదీసుకోగల నేర్పుందిట తనకి. ఈ మాటలు వింటుంటే నాలో ఏదో విషం వూరుతున్నట్లనిపించింది. నా కళ్ళ ఎదుట ఏవో వూహలు రూపుకట్టి నిలిచాయి. దాంపత్య పవిత్రతను ఉల్లంఘించేందుకు సహితం మనసు వురకలు పెట్టింది.

గుంతకల్లు స్టేషను రాగానే దిగి గబగబా బెంగుళూరు వెళ్ళే పెట్టెలో ఎక్కాం. మా దగ్గర సామాను ఎక్కువగా లేదు. తేలిగ్గానే చేత్తో పట్టుకోగలిగాం. ఇతర పనులతో పాటు, ప్రజల జీవనం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా మా ప్రయాణానికి కారణమయింది. నిజానికి ఈ లక్షలాది జన సామాన్యంలో నే కూడా ఒకణ్నే. స్కూటరుపైన నిర్లక్ష్యంతో కూర్చొని రోడ్డుమీద ఎవర్నో గుద్దేసి ఏమీ జరగనట్టే వెళ్ళిపోగల శక్తి నాకు లేదు. అలాంటిదేమైనా జరిగితే నాకున్న ఆస్తిపాస్తులు అమ్ముకుంటేగాని బయటపడలేను.

రైలు పెట్టెలో ఎక్కాం. ఒక బల్లమీద కూర్చున్న ముసలావిడ జరిగి చోటిచ్చింది. నేను ఆవిడ పక్కగా కూర్చున్నాను. నా మిత్రుడికి ఎదురుబల్ల మీద జాగా దొరికింది. నే కూర్చున్న బల్ల చివర కిటికీకి అనుకుని ఒక అమ్మాయి కూర్చుంది. లేత వయసే. ఆ అమ్మాయి పక్కన్నే కూర్చునేందుకు జాగావుంది. అయినా నేను అక్కడ కూర్చోకుండా ముసలావిడ పక్కనే కూర్చోవాలనుకున్నాను. ఆ పిల్ల మురికిగా వుంది.

ముసలావిడకి తిండి ధ్యాస ఎక్కువలా వుంది. రైలు ఆగిన ప్రతిస్టేషన్లోనూ చిరుతిండి కొనుక్కుని తింటూనే వుంది. ఒక్కోసారి మాక్కూడా పెట్టబోయేది.

మొదట ఆవిడే సంభాషణ ప్రారంభించింది. ఎక్కడికెళ్తున్నామో అడిగి

తెలుసుకుంది. మా ఉద్యోగ వివరాలు కనుక్కుంది. నేను కూడా కొన్ని ప్రశ్నలు వేశాను. మైసూరు దగ్గర ఏదో పల్లెటూరని చెప్పింది. తనకున్న బాధ్యతలు పేర్కొంటూ, దగ్గర బంధువుకి పెళ్ళి చేయవలసి వుందని వివరించింది. ఆ బంధువు పై బల్ల మీదున్నాడని వేలితో చూపించింది.

కాసేపయ్యాక అతను కిందికి దిగాడు. మనిషి బలిష్ఠుడు. స్కూటర్ల మరమ్మతు చేస్తుంటాడు. వ్యాపారం లాభసాటిగానే వుందట. ముసలావిడ అతనికి మామిడి పండొకటి అందించింది. ఎందుకో గాని ఆవిడతో పాటు వాళ్ళ వూరెళ్ళి కొన్ని రోజులు వుండాలని పించింది. ఆ మాట ఆవిడతో అన్నాను కూడా. కాదనలేదు.

రైలు ఆగింది. పెద్ద స్టేషనై వుండాలి. ధర్మవరం కాబోలు. ప్రయాణికులు అక్కడే భోజనం చేస్తారు. ముసలావిడ అన్నం పొట్లాలు కొంది.

"రాత్రి నుంచి ఏమీ తినలేదుగా! ఒక పొట్లాం తీసుకో." ఎవరితో మాట్లాడుతుందో మొదట నాకు అర్థం కాలేదు. కిటికీ దగ్గర కూర్చున్న అమ్మాయితో అంటుందని తర్వాత గ్రహించాను.

"రాత్రి నుంచి ఏమీ తినలేదా!" ఆశ్చర్యంతో మాటలు నా నోటి నుంచి వెలువడ్డాయి.

"అవును, నిన్న రాత్రి నుంచి ఏమి తినలేదు" పెట్టెలో ఎవరో ఒక ప్రయాణికుని గొంతు బదులు పలికింది.

ఆ అమ్మాయి మొదట కదల్లేదు. తప్పించుకు పోవాలనుకునే కుక్క పిల్లలా ఒదిగి కూర్చుంది.

ముసలావిడ చేయి జాపి పొట్లాం అందించింది. అమ్మాయి లేచి ముసలావిడ దగ్గరకొచ్చింది. నాకు ఆవిడ బంధువుకి మధ్య కూర్చోమంటూ అమ్మాయితో చెప్పింది. అలాగే కూర్చుంది. కిందటి రాత్రి నుంచి ఏమీ తినకుండా వున్న వాళ్ళు అవురావురుమంటూ తినడం సహజం. కాని ఆ అమ్మాయి అలా చేయలేదు. నిదానంగా తింది. తినడం అయ్యాక ముసలావిడ మామిడి పండిచ్చింది. అమ్మాయి ముఖంలో కడుపు నిండిన తృప్తి వ్యక్తమయింది. నా మిత్రుడు, ఇతర ప్రయాణికులు ఆమె వంక చూస్తున్నారు

అమ్మాయి గురించిన వివరాలు తెలుసుకోవాలన్న ఉత్సుకత నాలో పెరిగింది.

"నీ పేరు ఏమిటమ్మాయి?" అడిగాను.

"జకియా" నెమ్మదిగా జవాబిచ్చింది.

"ఎక్కణ్నుంచి వస్తున్నావ్"?

"హైదరాబాదు నుంచి"

"అక్కడేం చేస్తుంటావ్!"

"సేఠ్ సులేమాన్ ఇంట్లో పనిచేసేదాన్ని"

ఆ అమ్మాయిని చూస్తే ఇంటి పని చేస్తుందని తెలిసినా ఏం పనిచేస్తావని అడిగాను. ముసలావిడా, ఆమె బంధువు మా సంభాషణ జాగ్రత్తగా వింటున్నారు.

సులేమాన్ నర్సుల దుస్తులు తయారు చేస్తుంటాడని ఆ అమ్మాయి చెప్పింది. గిన్నెలు తోమడం, ఇల్లు వూడవడం లాంటి పనులు చేయడమే కాకుండా దుస్తుల తయారీలో కూడా తోడ్పడేదట.

"పని వదిలేసి మరి ఎందుకొచ్చేస్తున్నావమ్మాయ్"?

"నన్ను కొడుతుండేవారు"

"ఎందుకని"?

"ఏమో, తెలియదు" అమ్మాయి చెప్పింది. చేతులు చూపుతూ' "సేఠ్ పెళ్ళాం ఇనప చువ్వతో వాతలు పెట్టేది" అంది.

ఈ మాటలు మామూలుగా చెప్పింది ఆశ్చర్యపడవలసిన సంగతేమీ కాదన్నట్లు. మరొకరైతే వెక్కి వెక్కి ఏడుస్తూ కష్టాలగాథ చెప్పేవారు. కాని జకియా కంటి నుంచి ఒక్క చుక్క నీరు కూడా రాలలేదు. టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నట్లు కూడా తెలిసింది. సికింద్రాబాదులో రైలు డ్రయివరు ఈ పెట్టెలో ఎక్కమని చెప్పాడట.

"అయితే బెంగళూరు ఎందుకెళ్తున్నావ్?" అడిగాను.

"అక్కడ మా అమ్మ వుంది" సమాధానం ఇచ్చింది.

ఇతర ప్రయాణికులు మరికొన్ని ప్రశ్నలు వేశారు. వాటికీ జవాబు చెప్పింది జకియా.

తర్వాత స్టేషన్లో ఎదురుగావున్న బల్ల మీద కూర్చున్న ఆసామి దిగిపోయాడు. ఎక్కువ జాగా వుండడం చేత జకియా అక్కడికి వెళ్ళి కూర్చుంది. నా మిత్రుడు నా వైపు చూస్తూ కంటితో సైగ చేశాడు. అతని వుద్దేశం తెలిసి పోయింది. ఆమె కట్టుకున్న బట్టలు మురికిగా వున్నా అతని ప్రయత్నానికి అడ్డురాలేదు.

సంభాషణ ముందుకు సాగినకొద్దీ మరికొన్ని విషయాలు తెలిశాయి. ఏడేళ్ళ వయసు వున్నప్పుడు, తల్లి ఆమెను వదిలి మరో మగాడితో వుండేందుకు వెళ్ళి పోయింది. తల్లి ఇప్పుడెక్కడుందో జకియాకి తెలియదు. అయినా తల్లి దగ్గరికి వెళ్తోంది.

ఈ సన్నివేశంలో ముసలావిడ కలుగ చేసుకుంటూ "నాతో వచ్చేసెయ్ అమ్మాయ్! నీకు మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తాను."

జకియా ముఖంలో సిగ్గులు మొసులెత్తాయి. మరికొంత సేపయ్యాక ముసలావిడ ఒక సూచన చేసింది. ఆ అమ్మాయి పెళ్ళికి ప్రయాణికులు తలా కొంచెం పైకం సహాయంగా ఇస్తే బావుంటుందని అంది. అయితే డబ్బు వూసెత్తగానే ఎవరూ ఉత్సాహం చూపలేదు.

ముసలావిడ వెంటనే విషయం మార్చేసింది.

"నిజానికి డబ్బుది ఒక సమస్య కాదు. భగవంతుడు నాకింత స్తోమత ఇచ్చాడు. మా ఆయన చచ్చిపోయే ముందు నాకు డబ్బు మిగిల్చే పోయారు. సొమ్ము సమకూర్చగలను' అని విశదంగా చెప్పింది.

రైలు వేగం తగ్గింది. బహుశా మరో స్టేషను వస్తుండవచ్చు. దగ్గర్లో వున్న ప్రయాణికుడి దగ్గర్నుంచి పత్రిక అడిగి తీసుకుని తిరగవేయ సాగాను. వియత్నాం యుద్ధంలో బాంబులు వేయడం వల్ల కొంత ప్రదేశం జనావాసానికి పనికి రాకుండా పోయిందట. బంగ్లాదేశ్ గురించి మరో వార్త వుంది. పదిమంది సైనికులు ఒక స్త్రీపై అత్యాచారం జరిపారట.

స్టేషనంతా సందడిగా వుంది. కాఫీ, టీ కేకలతో కుర్రాళ్ళు ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. పకోడి, మామిడిపళ్ళు, అరటి పళ్ళు అమ్మే వాళ

ళ్ళ కూడా తీసిపోలేదని నిరూపిస్తున్నారు.

టిక్కెట్టు ఇన్‌స్పెక్టరు మా పెట్టె దగ్గర అటూఇటూ తిరుగుతున్నాడు. రైలు బయలుదేరేటప్పుడు మా పెట్టెలోకి ఎక్కుతాడేమో! ఆ సంగతి ఇతర ప్రయాణికులకి చెప్పి హెచ్చరించాను. జకియాకి సహాయపడాలని అందరికీ నచ్చచెప్పాను. తలా కొంత పైకం ఇవ్వచ్చునని కొందరు సూచించారు. టిక్కట్టు ఖరీదుతో పాటు జరిమానా కూడా చెల్లించాలి. ఇన్‌స్పెక్టరు పట్టు పట్టవచ్చు. అప్పుడు ఎక్కువ డబ్బులు కావాలి అది కష్టం.

జకియాను బల్ల కింద దాక్కోమని చెప్పడమే తగిన మార్గమని అనుకున్నాం. అలా చేయడానికి జకియా సిద్ధంగా వుంది.

ఇన్‌స్పెక్టరు పెట్టేలో ప్రవేశిస్తుండగానే జకియా బల్ల కిందికి దూరింది. పెంపుడు కుక్క యజమాని కాళ్ళా వెనక దాక్కున్నట్లుగా వుంది. గంటన్నర ప్రయాణం తర్వాత ఇంకో స్టేషను వచ్చింది. ఇన్‌స్పెక్టరు దిగిపోయాడు. నవ్వుతూ జకియా బల్ల కింది నుంచి ఇవతలికొచ్చింది. మేం కూడా నవ్వాం.

జకియా బెంగుళూల్లో అసలు తన తల్లిని కనుక్కోగలుగుతుందా అనే ప్రశ్న అలాగే వుండి పోయింది. కనుక్కొలేక పోతే ఏం చేయాలి? ఇఒక్కటే ప్రశ్న కాదు. ఇంకా వున్నాయి. ఒకవేళ ఎలాగో కనుక్కున్నా తల్లి జకియాని తన దగ్గర వుండనిస్తుందా! నా మిత్రుడు అభిప్రాయం అడిగాను. ఇతర ప్రయాణికులతో కూడా సంప్రదించాను. బెంగుళూరికి కొన్ని స్టేషన్ల ముందే జకియాకు టిక్కెట్టు కొనాలని నిశ్చయించుకున్నాం.

ఇంతలో జకియా ముసలావిడతో వెళ్తానని చెప్పి మమ్మల్నందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. నా మనసులో రకరకాల ఆలోచన్లు రేకెత్తాయి. ఈ ముసలిది ఎత్తు బాగా వేసింది అనుకున్నాను. జకియాని పోలీసుల రక్షణలో వుంచితే నయం కదా! అనే ఆలోచన వచ్చింది. అది మంచి పని కాదనిపించింది. ఆమె లేత వయసు పొంగుకు పోలీసులైనా, మరెవరైనా సరే సమ్మోహితులు కాక పోరు.

ముసలావిడతో కొత్త ఆలోచనగా సంభాషణకుపక్రమించాను.

"మీదే వూరన్నారు"

"చెన్న పట్టణం"

"మేం నిజంగా వస్తే మీకేం యిబ్బంది వుండదా?" అడిగాను.

కాసేపు ఆలోచించింది.

"అబ్బే! కాని మాతో వుండగలుగుతారా అని సందేహం"

"ఉంటాం. మీకేమైనా అభ్యంతరమా!"

"ఏం లేదు. తప్పకుండా రండి. మీకు టి.చి.లో వసతి ఏర్పాటు చేస్తాను. కాని భోజనం మాత్రం మా యింటి దగ్గర్నుంచే తీసుకొస్తాను సుమా!"

"టి.చి.లో ఎందుకు? మే యింట్లోనే వుంటాం" ఈలోగా నా మిత్రుడు సంభాషణను మరో వైపు మళ్ళించాడు.

ముసలావిడ అడ్రసు రాసుకున్నాను. బెంగుళూరు నుంచి కాలికట్ వెళ్ళేటప్పుడు ఒకటి రెండు రోజులు నిజంగానే చెన్నపట్టణంలో గడపాలని నిర్ణయించుకున్నాను.

జకియా ముసలావిడ వెంట వెళ్ళేందుకు పెట్టెలో అందరూ సుముఖంగా వున్నారు. నాకూ అది సరైనదే అనిపించింది. మాకు బెంగుళూరు కొత్త. జకియాను మా వెంట తీసుకెళ్తే కొందరు అనుమానించవచ్చు. పోనీ జకియాను ఏదైనా స్త్రీ సదన్‌లో వుంచుదామా అంటే అది అంత శ్రేయస్కరం కాదు.

'ఏడేళ్ళ కూతుర్ని జాలి ఏ కోశాన లేకుండా వదిలి పెట్టిన తల్లి, ఇప్పుడెలా దయచూపుతుంది?' అని ముసలావిడ అన్న మాటలు నిజమనిపించాయి.

ఇప్పుడు జకియాకి ముసలావిడ సంరక్షకురాలయింది. మేమందరం వూరుకున్నాం. జకియాకి టిక్కెట్టు సంగతి కూడా ఆవిడే చూసుకుంటుంది.

బెంగుళూరు స్టేషను వచ్చేసింది. అందరూ సామాన్లు సర్దుకుని దిగిపోయే హాడావుడిలో వున్నారు. జకియా సంగతి ఎవరు పట్టించుకుంటారు.

దిగేటప్పుడు నా మిత్రుడుతో అన్నాను, 'ఈ అమ్మాయిని ముసలావిడికి అప్పగించడం మంచి పనిగా తోచడంలేదు'

చిరునవ్వు నవ్వాడు. 'నువ్వు వట్టి అమాయకుడివి. చెబుతున్నా విను–అమ్మాయి ఆవిడ తాలూకే. ముసలావిడ అమ్మాయిని డబ్బిచ్చి ఎక్కడో కొన్నదని నా గట్టి నమ్మకం. ఎవరికీ అనుమానం కలగకుండా రాత్రంతా అమ్మాయికి దూరంగా వుంది. తీరా నువ్వు అమ్మాయి గురించి శ్రద్ధ చూపడంతో గాబరాపడింది"

నా శరీరంలోకి కొత్తగా మంచి విషాన్ని ఎక్కించినట్లునిపించింది.

హిందీమూలం : శ్రావణ్‌కుమార్

అనువాదం: గోవిందరాజు రామకృష్ణారావు

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నుంచి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

సోర్స్ కోడ్

సృష్టికి ప్రతి సృష్టి త్రీడీ ప్రింటింగ్

కె.ఎక్స్.రాజు

టెక్నాలజీ రంగం సరికొత్త ఆవిష్కరణలకు అతి పెద్ద వేదిక. తొలిరోజుల్లో ఒక పేద్ద గదిలో పట్టేంత కంప్యూటర్... నేడు ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని మన జేబులో ఇమిడిపోయింది. అదే మాదిరిగా చరిత్ర గతిని మార్చిన అనేక టెక్నాలజీలను మనం చూస్తున్నాం. అదే మాదిరిగా ప్రపంచ గతినే మార్చబోతున్న మరో సరికొత్త టెక్నాలజీ మన ముంగిట ఆవిష్కృతమౌతోంది. వైద్యం మొదలుకొని ఫ్యాషన్ రంగం వరకూ, గుండు సూది మొదలుకొని గుండె వరకూ ప్రతిదానికీ ప్రతి సృష్టి చేయగల అద్భుత సాంకేతిక పరిజ్ఞానమే త్రీడీ ప్రింటింగ్.

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ గురించి గత కొన్నేళ్లుగా వింటూనే ఉన్నాం. ఇటీవల ఈ టెక్నాలజీ సృష్టిస్తోన్న అద్భుతాలు ప్రపంచాన్ని అబ్బురపరుస్తోంది. చిత్రకారులు, శిల్పులకు త్రీడీ ఓ సృజనాత్మక సాధనం. చాక్లెట్ నుండి మనిషి అవయవాల వరకూ ఈ త్రీడీ టెక్నాలజీతో ప్రింట్ చేయొచ్చు. అందుకేనేమో దీన్ని మరో పారిశ్రామిక విప్లవంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. త్రీడీ ప్రింటింగ్ కొన్ని అపురూపమైన వస్తువులను తయారు చేసుకునేందుకు మాత్రమే పనికొస్తుందని ఒకప్పుడు అనుకున్నా ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చాక్లెట్లు, క్యాండీల వంటి ఆహార పదార్థాలను రకరకాల ఆకారాల్లో తయారు చేసుకోవడం మొదలుకొని... సుదూర గ్రహాలపై మానవ ఆవాసాలను నిర్మించేందుకు ఉన్న అవకాశాల వరకూ అన్నింటిలోనూ త్రీడీ ప్రింటింగ్ ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. గతేడాది జనవరిలో త్రీడీ సిస్టమ్స్ కంపెనీ ప్రసిద్ధ చాక్లెట్ తయారీ సంస్థ హెర్షీతో జట్టుకట్టి త్రీడీ చాక్లెట్లను తయారు చేయడం మొదలుపెట్టింది. మరోవైపు నెదర్లాండ్‌లోని ఓ డాక్టర్ల బృందం మనిషి పుర్రెలో కొంత భాగానికి ప్రత్యామ్నాయాన్ని త్రీడీలో ప్రింట్ చేసి ఉపయోగించింది. అంతేకాదు... శరీరంలోని ప్రతి అవయవాన్నీ త్రీడీ ప్రింటింగ్ ద్వారా కృత్రిమంగా తయారుచేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

త్రీడీ ప్రింటింగ్ అంటే... సాధారణంగా మనం ప్రింట్ చేసేవి 2డి రకానికి చెందిన ప్రింటర్లు. వీటిలో పొడవు, వెడల్పు మాత్రమే వుంటాయి. 3డిలో పొడవు, వెడల్పుతో పాటు ఎత్తు కూడా వుంటుంది. మామూలు ప్రింటర్లు కాగితాలపై అక్షరాలను ముద్రిస్తే... త్రీడీ ప్రింటర్లు ప్లాస్టిక్ వంటి పదార్థాలతో పొరలు పొరలుగా పేరుస్తూ వస్తువులను తయారు చేస్తాయి. మనకు నచ్చిన ఆకారంలో ఏ వస్తువు నమూనానైనా ముద్రించుకునే అవకాశం త్రీడీ ప్రింటింగ్‌లో వుంది. ఉదాహరణకు... ఏ అంజతా శిల్పాన్నో చూస్తాం. మామూలుగా అయితే ఫొటో తీసుకుంటాం. కానీ ఈ టెక్నాలజీలో త్రీడీ స్కానర్‌తో ఆ శిల్పాన్ని స్కాన్ చేస్తే చాలు. ప్రింటర్‌లో అచ్చుగుద్దినట్లుగా అలాంటి బొమ్మే తీసుకోవచ్చు.

కావాల్సినవి... త్రీడీ ప్రింటింగ్‌కు ప్రధానంగా కావాల్సినవి త్రీడీ ప్రింటర్, మాయా, ఆటోక్యాడ్ వంటి ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌తో కూడిన కంప్యూటర్, స్కానర్ అవసరమౌతాయి. జిరాక్స్ మెషీన్‌తో కాగితాలపై ప్రింట్ చేసిన మాదిరిగా త్రీడీ ప్రింటర్‌లో అవసరాన్ని బట్టి సిరామిక్, ప్లాస్టిక్, లోహాలు వాడుకోవచ్చు. ఫిలమెంట్, గుళికలు, ఫౌడర్ రూపంలో ముడిసరుకు లభ్యమౌతున్నాయి. కంప్యూటర్ నుండి సంకేతాలు ప్రారంభం కాగానే మనం కోరుకున్న నమూనాలో ప్రింటింగ్ ప్రారంభం అవుతుంది. 1984 ప్రాంతంలో చార్లెస్ హుల్ అనే శాస్త్రవేత్త ఆలోచనల నుండి పుట్టిందే ఈ సరికొత్త ఆవిష్కరణ. వైద్యం, నిర్మాణం, పరిశ్రమలు, ఫ్యాషన్స్ వంటి ప్రతి రంగాన్నీ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ప్రభావితం చేస్తోంది. ప్లాస్టిక్ లాంటి పదార్థాలతో తయారు చేసిన ఫిలమెంట్ లేదా ఇతర పదార్థాలు అవసరమవుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.15 వేల నుంచి లక్ష రూపాయల వరకూ ఖరీదు చేసే రకరకాల త్రీడీ ప్రింటర్లు అందుబాటులో ఉన్నాయి.

వైద్య రంగంలో... ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతను ఉపయోగించి.. నెదర్లాండ్స్‌లో ఒక యువతికి పుర్రె మార్పిడి శస్త్రచికిత్స చేశారు. త్రీడీ ప్రింటర్‌తో.. ఆకారం, పరిమాణం సహా అచ్చం ఆ మహిళ పుర్రెను పోలిన కృత్రిమ ప్లాస్టిక్ పుర్రెను, పుర్రె భాగాలను శాస్త్రవేత్తలు ప్రింట్ చేసి అమర్చారు. నెదర్లాండ్స్‌లోని యూట్రెచ్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ వైద్యులు.. గతేడాది జనవరిలో దాదాపు 23 గంటలపాటు సుదీర్ఘ శస్త్రచికిత్స చేసి, ఆమెకు కృత్రిమ పుర్రెను అమర్చారు. త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతతో వైద్య శాస్త్రంలో అద్భుతాలు సాధ్యమని యూట్రెచ్ వర్సిటీ వైద్యుడు బోన్ వెర్వేజ్ పేర్కొన్నారు.



ఫ్యాషన్ రంగంలో... ఆధునిక ఫ్యాషన్ ప్రపంచం సరికొత్త శిఖరాలకు చేరుకుంది. ఇప్పుడు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో డ్రస్సులు కూడా డిజైన్ చేయవచ్చు. శరీరాకృతికి సరిగ్గా సరిపోయేలా దుస్తులు రూపొందించడం ఈ విధానం ప్రత్యేకత. తొలుత శరీరాకృతిని త్రీడీ స్కానింగ్ చేస్తారు. అనంతరం వారికి నచ్చిన డిజైన్‌తో సరిగ్గా ఒంటికి సరిపోయేలా త్రీడీ ప్రింటర్ ద్వారా డ్రెస్ ప్రింట్ చేస్తారు. అమెరికా మసాచుసెట్స్‌కు చెందిన ఓ డిజైన్ స్టూడియో ఈ వినూత్న ఆవిష్కరణ చేసింది. ఒక్క డ్రెస్‌ను ప్రింట్ చేయడానికి 48 గంటల సమయం పడుతుందని, ఇందుకు 3వేల డాలర్లు (దాదాపు రూ.1.80 లక్షలు) ఖర్చవుతుందని దీని రూపకర్తలు చెబుతున్నారు. డ్రెస్‌లే కాదు, ఆభరణాలను కూడా క్షణాల్లో తయారు చేయొచ్చట. ఈ మధ్య మలేషియాలో త్రీడీ ప్రింటింగ్ ఫ్యాషన్‌షో జరిగింది. త్రీడీ నగలతో మోడళ్లు మెరుపులు మెరిపించారు.

భవిష్యత్తులో... ఈ టెక్నాలజీకి అద్భుతమైన భవిష్యత్ వుంటుందని నిపుణులు భావిస్తున్నారు. 2018 నాటికి త్రీడీ ప్రింటింగ్ మార్కెట్ విలువ దాదాపు 18బిలియన్ డాలర్లు అంటే లక్ష కోట్ల రూపాయల వరకూ ఉంటుందని నిపుణుల అంచనా. దీన్నిబట్టే ఈ టెక్నాలజీ పట్ల అంచనాలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో ఈ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెంది బయో ప్రింటింగ్‌గా రూపాంతరం చెందుతుందని కొందరు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్పుడు శరీర అవయవాలను కూడా పరిశోధనశాలల్లో ప్రింట్ చేసుకుని వాడవచ్చునని అంచనా. ప్లాస్టిక్ లాంటి పదార్థాలకు బదులుగా జీవకణాలను కృత్రిమ పద్ధతుల్లో పెంచి ప్రత్యేకమైన ప్రింటర్లు ఉపయోగించడం ద్వారా అవయవాలను ఉత్పత్తి చేయడం సాధ్యమేనని వీరు అంటున్నారు. ఇప్పటికే కణజాలంతోపాటు కొంతమేరకు రక్తనాళాలను కూడా త్రీడీ ప్రింటింగ్ సాయంతో తయారు చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో గుండెపోటు ద్వారా దెబ్బతినే కణజాలానికి ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయవచ్చునని అంచనా. భవిష్యత్‌లో ఇలాంటి పరిణామాలు ఎన్నయినా జరగొచ్చు. ఏ టెకాల్నజీ అయినా మానవ వికాసానికి తోడ్పడేదిగా వుండాలని కోరుకుందాం.

– రచయిత సెల్ : 9490099219

నిర్దిష్ట అవగాహనకు అధ్యయనం



అధ్యయనం-ఆచరణ
రచన: తమ్మినేని వీరభద్రం
పేజీలు: 144, వెల: రూ. 70
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

ఏ రంగంలో పనిచేస్తున్న వారికయినా అధ్యయనం అవసరం. అందునా ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టు ఉద్యమకారులకు అధ్యయనం తప్పనిసరి అవసరం. అధ్యయనం అవగాహనను విస్తృతం చేస్తుంది. తత్ఫలితంగా వారి ఆచరణ మరింత పదును తేలుతుంది. ఈ విషయాలను తమ్మినేని వీరభద్రం గారి 'అధ్యయనం-ఆచరణ' పుస్తకం సవివరంగా తెలియజేస్తుంది. పుస్తకాలు చదవకపోతే ఏమీ నేర్చుకోలేరు. ప్రపంచపోకడలపై సరయిన అవగాహన ఏర్పడదు. అందుకని మార్క్సిస్టు అధ్యయన కేంద్రాలు అవసరమని చెబుతూ ఖమ్మం స్టడీ సర్కిల్ అనుభవాల్ని వివరించారు. అధ్యయనం, దానికి సంబంధించిన చర్చల గురించి వీరభద్రం గారి మాటల్లోనే చెప్పాలంటే "చర్చల వల్ల చాలా ఉపయోగాలుంటాయి. చదవటం ఒక్కటే కాకుండా విషయాల చర్చ కూడా చేస్తే ఏదైనా బాగా వంట బడుతుంది. చదివినపుడు మనకేర్పడిన అవగహనలో పొరపాట్లుంటే, మనకంటే తెలిసిన వారితో చర్చ వల్ల అవి సరిజేయబడదాయి. ఇది చదివి చర్చించే వారి ఉపయోగం. ఇక చదవని వారికి తాము చదవకుండానే మిగతా వారు చెప్పిన విషయాలను వినటం, చర్చలో పాల్గొనటం ద్వారా గ్రహించే వీలుంటుంది".

దీనిని బట్టి అధ్యయనం, అధ్యయన సర్కిళ్ళ ప్రయోజనం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ పుస్తకంలోని పలు వ్యాసాల్లో ఈ విషయాన్ని వక్కాణించి చెప్పారు. అలాగే "మనిషిని నమ్మడం ఎలా? మనిషి పరాయీకరణ, సరిగ్గానే అర్థం చేసుకుంటున్నామా?" అనే వ్యాసాలు మౌలికాంశాలకు సంబంధించిన భావనల పట్ల స్పష్టతనిస్తాయి. ఒక మనిషిని నమ్మటం ఎలా అని మార్క్సిస్టు దృక్కోణం నుంచి వీరభద్రం గారు చేసిన విశ్లేషణ ఆకట్టుకునేలా వుంది. దీనిని ప్రత్యేకించి రచయితలు, కవులు శ్రద్ధగా చదవడం అవసరం.

ఈ పుస్తకంలో మొత్తం ఇరవై వ్యాసాలున్నాయి. కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు పత్రికలు, ఆచరణ-సిద్ధాంతం, పార్టీ ప్రాధాన్యత సభ్యుల విధుల వంటి వ్యాసాలు చదవడం వల్ల కమ్యూనిస్టుల మీద ఇతరుల అపోహలు తొలగిపోతాయి. అలాగే సాంస్కృతిక రంగంలో పార్టీ కర్తవ్యాలు సిపిఎం ఎజెండాని, దృక్పథాన్ని తెలియజేస్తుంది. ప్రపంచీకరణ క్రమంలో నిర్దిష్టమైన సైద్ధాంతిక స్ఫూర్తితో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించిందీ వ్యాసం. కమ్యూనిస్టుల భావనలు, విలువలు, ఆచరణకు సంబంధించిన మరింత స్పష్టతని ఇస్తుంది ఈ పుస్తకం. అందువల్లనే ఉద్యమంలో వున్నవారు, ఉద్యమాన్ని అభిమానించేవారు ఈ పుస్తకం చదవడం అవసరం.

- అశోక్ కుమార్

పోలవరంపై విశ్లేషణ



పోలవరం - ప్రాణాంతక ప్రయోగం (ముంపువాసుల గోడు), సంపాదకులు: అనిశెట్టి రజిత,
పేజీలు: 128, వెల: రూ. 100.
ప్రతులకు: రుద్రమ ప్రచురణలు, సెల్: 98494 82462

పోలవరం ప్రాజెక్టు వల్ల వాటిల్లే ముప్పు గురించి రుద్రమ ప్రచురణలు వెలువరించిన పుస్తకం 'పోలవరం - ప్రాణాంతక ప్రయోగం'. ఇది ముంపు గ్రామాల గోడును వ్యక్తం చేస్తుంది. ఆ ప్రాంతవాసుల ఆమోదం లేని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎంత ప్రమాదకరమో చెప్పడానికి ఇందులోని వ్యాసరచయితలు ప్రయత్నించారు. అనిశెట్టి రజిత సంపాదకత్వంలో వచ్చిన ఈ పుస్తకంలో 15 వ్యాసాలు, 12 కవితలున్నాయి. బాధిత ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరాన్ని రజిత సంపాదకీయం చెబుతుంది. పోలవరం నిర్మాణమా? విధ్వంసమా? అని భండారు విజయ ప్రశ్నిస్తారు. ఆదివాసీల హక్కుల గురించి మాట్లాడకపోవడాన్ని ఆక్షేపిస్తారు. దిలావర్, శిరంశెట్టి కాంతారావు, నల్లెల్ల రాజయ్య, అరుణ్‌కుమార్, మాల్యశ్రీ, బండారు రవికుమార్ వ్యాసాలు ఆలోచనాత్మకంగా వున్నాయి. పోలవరం గురించి ఒక అవగాహనని అందిస్తాయి. విభజించే పాలించే కుట్రల్ని డా. కొమర్రాజు రామలక్ష్మి నిలదీశారు. ఆధిపత్యాన్ని డా. బండారి సుజాత సవాల్ చేశారు. మొత్తంగా పోలవరం మీద ఒక అవగాహనని అందించే పుస్తకమిది.

పాఠకుల్ని అలరించే నవల



రామాయణం మామయ్య (ది హిట్లర్) నవల, డా॥ మంథా భానుమతి, పేజీలు 174, వెల : 100/-, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు.

కోనసీమలోని నర్సాపురం దగ్గరి సఖినేటిపల్లికి దగ్గరున్న అగ్రహారం అనే గ్రామపు పరిసరాలు అక్కడి సంపన్న బ్రాహ్మణ కుటుంబాలు, వారి ఆచార వ్యవహారాలు, సంప్రదాయ పూరిత ఆలోచనలు, ఆ సంప్రదాయాల్లోనే కొందరి మానవత్వం, మంచితనం, సంస్కారం, సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవటానికి ముందుకు రావడం, కులాంతర, విధవ వివాహాలకు ఆమోద ముద్ర వేయడం.. ఇవన్నీ 'రామాయణం మామయ్య' నవలలో కనిపిస్తాయి.

అసలు ఈ నవల రాయడంలోనే భానుమతి గారు కొత్త పంథానెన్నుకున్నారు. 1954-64 ప్రాంత నేపథ్యంలో సత్యం అనే కుర్రాడు... తన చదువు నిమిత్తం అగ్రహారం గ్రామానికి వాళ్ళ ఊరు వస్తాడు. అప్పటికే ఆ ఇంట్లో సత్యంలాంటి వాళ్ళు ఐదుగురుంటారు. కథంతా (చాలా మటుకు) సత్యం ఆలోచనల్లోనే సాగుతుంది.

సత్యం మామయ్య రామనారాయణం - మన నవల్లోని ప్రముఖ వ్యక్తి. రామాయణం మామయ్యగా పిలవబడుతుంటాడు. అన్ని విషయాల్లోనూ నిక్కచ్చి, కరాఖండి అయినా ఆయన మనసు వెన్న. దగ్గరి వారు ఎవరు కష్టాల్లో వున్నా, అవతలివాడు ఎంతటి దుష్టుడైనా (అలా భావించబడినా) మరో ఆలోచన లేకుండా ఆపన్న హస్తం అందిస్తాడు రామాయణం మామయ్య.

1954 దశకం అని ముందే చెప్పడం వల్ల నవలలోని సన్నివేశాలు (కొన్ని కొన్ని) అరవై దాటిన వారిని బాల్యంలోకి దొక్కుపోతాయి. ఇరవై దాటిన యువ పాఠకులకు ఆనాటి గ్రామీణ పరిసరాల్ని తెలుపుతూ 'ఆనాడు ఇలా ఉండేదా' అని ఆశ్చర్యానికి లోను చేస్తాయి. కనుక ఈ నవల పాఠకుల్ని అలరిస్తుందనడంలో ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు.

- కూర చిదంబరం, 8885552423

ఒకింత విస్మయం, విచికిత్స

ఆకాశయానం (కవిత్వం)
రచన: ముకుందరామారావు,
పేజీలు: 72, వెల: రూ. 60.
ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.

కవి, కథకుడు, అనువాదకుడు అయిన ముకుందరామారావు వెలువరించిన పన్నెండవ పుస్తకం 'ఆకాశయానం'. ఆయన కవిత్వ పరంపరలో ఇది మరో మేలిమిరత్నం. సున్నితమైన భావనా పరంపరను అలతి అలతి పదాలతో వ్యక్తీకరించడం వారి పద్ధతి. సాధారణంగా కనిపించే పదాలకు కవిత్వ పరిమళాన్ని సమకూరుస్తారు. ఒకింత విస్మయానికి, మరొకింత విచికిత్సకు లోను చేసే భావధార ముకుందరామారావు కవిత్వంలో ఉంటుంది. 42 కవితలున్న ఈ పుస్తకంలోనూ దానిని చూడొచ్చు. అనేకానేక అంశాల మీద వారి కవితాత్మక స్పందనలు, సంవేదనలు ఈ పుస్తకం నిండా కనిపిస్తాయి. అత్యాధునిక జీవితంలోని సంఘర్షణలు, విలువల సంక్షోభం, నిస్సారమైన బతుకుల్లోని దైన్యం తాలూకు ప్రతిస్పందనలు ఈ కవిత్వంలో కనిపిస్తాయి. ఉదాహరణకు 'నిద్రరాని రాత్రి' కవితలో ఇలా అంటారు: "పక్క పక్కనే నిద్రిస్తున్నా /ఒకరికి తెలియకుండా ఒకరు /ఎంత ఏకాంతమో/ ఎంత దూరమో / నిద్రలో ఎవరెక్కడో /శరీరాలెక్కడో".

మనుషుల మధ్య అగాథాన్ని, కనిపించని దూరాన్ని, భర్తీ చేయలేని వైమనస్యాన్ని సరిగ్గా వ్యక్తం చేశారు. ఇదే ఆధునిక మానవుని సంక్షోభం. మరి ఏమిటీ ప్రత్యామ్నాయం? కవి చెప్పరు, ఆలోచనకు పురిగొల్పుతారు.

- శశాంక

కథారూపంలో ప్రాచీన కవుల చరిత్ర



మన కవులు-మహాకవులు (తెలంగాణ ప్రాచీన కవుల కథలు), రచన: దోరవేటి, పేజీలు: 120, వెల: రూ. 60.
ప్రతులకు: చెన్నయ్య వి. దోరవేటి, 1-4-938/2/ఏ ఎస్.ఎల్.బి. నిలయం, ఫ్లాట్ నెం: 1-101 ముషీరాబాద్, హైదరాబాద్-500 020, ఫోను: 98662 51679

కవి, కథకుడు, వ్యాసరచయిత అయిన దోరవేటి తెలంగాణ ప్రాచీన కవుల చరిత్రను కథారూపంలో పరిచయం చేస్తూ 'మూసీ'లో పరంపరగా వెలువరించారు. వాటిలోంచి తొలివిడతగా 21మంది కవుల గురించి రాసిన గాథల్ని ఎంపిక చేసి 'మనకవులు-మహాకవులు' శీర్షికన పుస్తకరూపంలో ప్రకటించారు. నన్నెచోడుడు నుంచి మొదలుకొని ఏక్రామనాథుడు వరకు దీనిలో ఉన్నారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రాచీన కవుల గురించి ఆసక్తికరమైన రీతిలో తెలియజేశారు. నాటి కవుల వైయక్తిక జీవితాల్ని ఊహించేవారి ఆసక్తిని తీర్చే కథనరీతి వీటిలో వుంది. ముందుమాట రాసిన డా. సంగనభట్ల నర్సయ్య చెప్పినట్టు ఈ కథలు మనోహరంగా సాగడమే కాదు కవుల జీవితాల్లోని విశేషాలు శీర్షికల్లోనే చోటు చేసుకొని కథల్లో వర్ణితమైనాయి. ఒకనాటి కాలంలో జీవించిన శివదేవయ్య, మారన, రావిపాటి తిప్పన, గోన బుద్ధారెడ్డి, బమ్మెర పోతన, కాకునూరి అప్పకవి, హరిభట్టు, కొఱవి గోపరాజు, తెలగన, సారంగు తమ్మయ్య మొదలయిన వారి గురించి ఆసక్తికరమైన రీతిలో రచించిన చారిత్రక గాథలివి. సాహిత్యచరిత్ర నిర్మాణానికి ఉపకరిస్తుందీ పుస్తకం.

- దుర్గాప్రసాద్

తండ్రీ కూతుళ్ళ అనురాగ కథా మాలిక

ప్రమదాక్షరి కథామాలిక తండ్రి - తనయ,
వెల : 100/-, పేజీలు : 191,
ప్రతులకు : నవోదయ-04027664525,
తెలుగు బుక్‌హౌస్-9247446497.

తల్లి జన్మనిస్తే తండ్రి దారి చూపిస్తాడు. పిల్లలపై తల్లిదండ్రులకుండే ప్రేమను ఒకరి దానితో మరొకరి ప్రేమను పోల్చలేం. కాకపోతే ఇద్దరి వ్యక్తీకరణలో తేడా ఉంటుంది. ఇక తండ్రీ కూతుళ్ళ బంధం గురించి ఎంత చెప్పినా తక్కువే. కొంతమంది తల్లులు కూతురు గురించి చెప్తూ 'మా అమ్మాయి నాన్న కూతురు' అంటూ మురిపెంగా చెప్తుంటారు. చాలా మంది విషయంలో ఇది వాస్తవం కూడా. పైకి కనిపించినా, కనిపించకపోయినా తండ్రి ప్రేమ అనంతం. తండ్రీ కూతుళ్ళ మధ్య అనుబంధం ఒక్కో ఇంట్లో ఒక్కోలా ఉంటుంది. అలాంటి అనుబంధాల మాలికే ఈ ప్రమదాక్షరి కథామాలిక 'తండ్రీ - తనయ'. ఇందులోని 24 కథల్లో ఒకదానితో మరొకటి పోలిక లేదు. అన్నీ వైవిధ్యంగా ఉంటాయి. అందరు తండ్రులూ ఒక్కలా వుండరు, కూతుళ్లూ ఒకేలా వుండరు అనడానికి ఇందులోని కథలే ఉదాహరణ. కూతురు కాలు కిందపెడితే కంది పోతుందేమో అని అపురూపంగా చూసుకునే తండ్రులు ఉన్న సమాజంలోనే (ఓ నాన్న..., మీచ్ తుమ్మీ లేక్), కూతురు జీవితాన్ని తన ఆనందానికి పణంగా పెట్టే తండ్రులూ (ఒక ఇంటి కథ, ఏం బంధాలివి!?) ఉన్నారు. బలహీనతలకు లొంగిపోయిన తండ్రిని సరిదిద్దే కూతురు (ఎంత మంచి వాడవు నాన్నా!), ఆడపిల్లని తక్కువగా చూసి, ఆ కూతురే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నప్పుడు తన తప్పు తెలుసుకున్న తండ్రి (చిరంజీవ... విజయీభవ!), తండ్రిని చూసుకోవడానికి ఏ ఆడపిల్లా చేయని పౌరోహిత్యాన్ని స్వీకరించిన కూతురు (నువ్వు నేర్పిందే నాన్నా...!), 'నన్ను చూసుకున్నట్టు అమ్మనెందుకు చూసుకోలేదు నాన్నా' అని తండ్రిని ప్రశ్నించే కూతురు (నాన్నకో ఈ మెయిల్)... ఇలా ఒక్కో కథలో ఒక్కో రకమైన తండ్రీ కూతుళ్లు కనిపిస్తారు. ప్రతి కథలోనూ భిన్నత్వం కనిపిస్తుంది. కానీ కథలన్నీ తండ్రీ కూతుళ్ళ మధ్య అనుబంధాన్ని తెలిపేవే. ఈ కథా సంపుటికి ఓ ప్రత్యేకత వుంది. ఇందులోని కథలన్నీ రచయిత్రులే రాశారు. కథలన్నీ కూడా ఊహాతీతం కాకుండా జరిగిన సంఘటనలే. ప్రతి కథకూ చివర మంథా భానుమతి గారు రాసిన విశ్లేషణ ఆకట్టుకుంటుంది. ఇంతమంచి కథలని కథా సంపుటిగా తీసుకొచ్చిన జ్యోతి వలబోజు అభినందనీయులు.

- అఖిల

■ ఈ వారం కవిత్వం

చిగురించిన జీవిత వంతెన

ఎండాకాలంలో పెద్ద మనిషైన చెట్టు
ఆకుల బట్టలన్ని విప్పేసి
తలారా స్నానం చేసింది
వానాకాలంలో శోభనానికై
చెట్టు,

పచ్చని ఆకుల చీరకు కట్టుకుంది
తలలో పూలన్నీ తురుముకుంది
గర్భాన్ని దాల్చి
కాయల పిల్లలను కన్నది
కొమ్మల చేతులతో ఎత్తుకుని ఆడిస్తుంది
చలికాలం మంచుతో
పిల్లకాయలు వణుకుతుంటే
ఆకుల చీరను దుప్పటిగా కప్పింది
పిల్లలు పెద్దవి కాగానే
స్వంతంగా బతకమంటూ
తన చేతుల నుండి
సుతారంగా జారవిడుస్తుంది
పిల్లలు పెద్దవై తన కళ్ళముందే
తల్లిగా మారి ఎదుగుతుంటే
ఎన్నో దీవెనలిస్తుంది
వయసు ముదిరాక ఎండిపోయి
చుట్టూ పెరిగిన పిల్లలను చూస్తూ
హాయిగా జీవితాన్ని చాలిస్తుంది
మనవలు ముని మనవరాళ్ళైన తీగలన్ని
అమ్మమ్మా అంటూ
చుట్టూ పెనవేసుకొని భోరున ఏడుస్తుంటే
తను చనిపోయినా
చూసే వారికెప్పుడూ
నిండు ముత్తైదువులా అవుపడుతూనే ఉంటుంది

- స్ఫూర్తి, 9490098694

మౌనం

మంచు తెరల మీదుగా
మాటలు కరిగిపోతున్నాయి
పాట ఆగకముందే
చెట్టు మీది పిట్టలు ఎగిరిపోతున్నాయి
నీకూ నాకూ మధ్య ముఖాముఖి
ఒక సందిగ్ధ క్రియ –
నీ అడుగుల మీదుగా నడిచీ నడిచీ
నీ గుండెలోతులను తడిమి చూశాను
నా నవ్వుల మీదుగా నీవు కదిలీ కదిలీ
నీ ఆనందంలోకి నన్ను ఒంపున్నావు
ఇప్పుడు
నీవు, నీ గదిలో – నిశీధిలో
ఆలోచనా దు:ఖపు దారుల్లో...
నేను
చలికాలపు చల్లని గాలుల మీదుగా
వెచ్చని జ్ఞాపకాలను కప్పుకుంటూ
రేపటిని కలగంటూ...
సమయం ఇంకా మౌనంగా
కదిపితే ఉద్విగ్నంగా

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

టెర్రస్ వ్యవసాయం

చైనాలో లాంగ్ షెంగ్ అనే ప్రాంతంలో సముద్ర మట్టానికి 800 మీటర్ల ఎత్తులో కొండ మీద వరి సాగు చేస్తున్నారు. ఈ కొండ చదునుగా, విశాలంగా ఉండే ప్రాంతం కూడా కాదు. కొండ అడుగు భాగం నుండి శిఖరం వరకు మెట్లు మెట్లుగా ఉంటుంది. అక్కడ గత ఆరు శతాబ్దాలుగా ఇలాగే వరి పంటను పండిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రెండు లాభాలున్నాయట. ఒకటి పై భాగం నుండి నీరు వృథాగా పోకుండా కిందున్న పంటకు ఉపయోగ పడుతుంది. రెండోది కొండ మీది నేల ఎప్పుడూ సారవంతంగా ఉంటుంది. ఇది పంట పండించేవాళ్ళకి లాభమే కాదు చూసే కళ్ళకీ ఇంపుగా కనిపిస్తుంది.

పతంగుల పండగ

సంక్రాంతి పండగ వస్తుందంటేనే పిల్లలకి, పెద్దలకి ముందుగా గుర్తొచ్చేది పతంగులే. ఒకరికంటే మరొకరి గాలిపటాలు ఎక్కువ ఎత్తుకు ఎగరాలని పోటీ పడి మరీ ఎగరేస్తుంటారు. గాలిపటం ఎంత ఎక్కువ ఎత్తుకు పోతే అంత సంబరం. ఇవి ఎగరేస్తుంటే విసుగు రాదు, విరామం వద్దు. అన్నీ మర్చిపోయి ఆనందంగా గడిపే అపురూపమైన మధుర క్షణాలవి.